J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12 THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్


సంపుటి : 43 సంచిక : 12 25.8.2023, శుక్రవారం వెల : రూ. 5 /-
వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి




# హమారా భారత్ మహాన్
# దిగ్విజయంగా చంద్రయాన్

ఎన్నో ఏళ్ళ నాటి కల సాకారమైంది. 'చందమామ రావో..జాబిల్లి రావో' అంటూ దాదాపు ఆరువందల సంవత్సరాల క్రితమే మన అన్నమయ్య అద్భుతంగా చంద్రుడికి భూమండలం నుంచి స్వాగత గీతం పలికారు. చందమామే నేలకు దిగిరావడం అన్నది ఒక కలే అయినా..నేరుగా చందమామను మన 'విక్రముడు' చేరుకోవడం మాటలకందని మధురానుభూతి. చందమామను తాకాలని, ఆ వెన్నెల వెలుగులను స్పృశించాలని, జాబిలమ్మతో మానవాళికి ఉన్న అనుబంధాన్ని నేరుగా పంచుకోవాలని, ఆ వెండివెన్నెల సామ్రాజ్యంలో ఏముందో తెలుసుకోవాలని ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలందరూ ఉవ్విళ్ళూరుతున్న నేపథ్యంలో, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఆ అద్భుతాన్ని అందరికీ పంచింది. ఎవరూ ఊహించని విధంగా చందమామ దక్షిణ ధృవంలో తొలిసారిగా అడుగు పెట్టి ప్రపంచం మొత్తాన్ని ఉద్వేగభరితమైన ఆనందోత్సాహాలతో నింపేసింది. వెన్నెల లోకంలో మువ్వన్నెల జెండా విరిసింది. భరతజాతి గుండె ఆనందంతో ఉప్పొంగింది. అంతరిక్ష రంగంలో భారత్ మహోజ్వల ఘట్టాన్ని సృష్టించి, తిరుగులేని ఖ్యాతిని ఇస్రో సొంతం చేసుకుంది. చంద్రయాన్ ప్రయోగాన్ని విజయవంతం చేసి 'హమారా భారత్ మహాన్' అనే నినాదాన్ని నిజం చేసింది. ఇది భారతీయులందరికీ గర్వకారణమైన రోజు. శాస్త్రవేత్తల సమిష్టి కృషి, నిరంతర శ్రమ.. అకుంఠిత దీక్షాదక్షతల ఫలితంగా అంతరిక్ష ప్రయోగాల్లో భారత్ నేడు తిరుగులేని కీర్తిని సాధించింది. ఈ విజయం ఒక్క భారత్‌దే కాదు..సకల మానవాళి అందరిదీ కూడా. అందుకే, ప్రపంచమంతా భారత్ సాధించిన విజయాన్ని అభినందించింది. భారత్ కీర్తి అజరామరంగా.. ఆచంద్రతారార్కంగా నిలిచింది.

3లో





# పల్లె గడపలో బాబు గెలుపు..
# వైసిపికి మేలుకొలుపు





రాష్ట్రంలో తాజాగా జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల ఫలితాలు రాజకీయ వర్గాలలో అనేక చర్చలకు, అనుమానాలకు తెరలేపుతున్నాయి. వైసీపీ బలం, బలగమంతా పల్లెల్లోనే ఉందన్నది ఆ పార్టీ ధీమా. అందుకే ఈ ఏడాది మార్చిలో మూడు పట్టభద్ర స్థానాలను టీడీపీ కైవసం చేసుకున్నప్పుడు కూడా 'వీళ్లు మా ఓటర్లు కాదు.. మా ఓటు బ్యాంకు వేరే ఉంది' అని ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆ అపజయాన్ని చాలా తేలికగా కొట్టిపారేశారు.

10లో






# 'జాతీయ ఫిల్మ్ అవార్డ్స్'లో తెలుగోళ్ళు..
# తగ్గేదే లే

9లో



# నగరం.. సమస్యల నిలయం

## ప్రజాపోరు యాత్రలో సిపిఎం ఆందోళన

నెల్లూరు నగరం రానురాను సమస్యల నిలయంగా మారుతోందని, ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కూడా అందడం లేదని, పెన్నా నది పక్కనే ఉన్నా అనేకప్రాంతాల ప్రజలకు తాగేందుకు గుక్కెడు మంచినీళ్ళు సైతం అందించలేకపోతుండడం విచారకరమని కార్పొరేషన్ పాలన తీరుపై సిపిఎం నాయకులు ధ్వజమెత్తారు. ఇటీవల నగరంలో పెద్దఎత్తున నిర్వహించిన ప్రజాపోరు యాత్రలో నాయకులు మాట్లాడుతూ, నగరంలో పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నాయని, ప్రధానమైన పంటకాలువలు వ్యర్థాలతో మురుగుతో నిండిపోయాయని, నగరంలో దోమలు ప్రబలిపోయి అంటు వ్యాధులు, విషజ్వరాలు పెరిగిపోయి ప్రజలు నానాబాధలు పడుతున్నారని ఆవేదన చెందారు, ఇకనైనా ప్రభుత్వం, అధికారులు ప్రజల సమస్యలను పట్టించుకోవాలన్నారు. తొలుత నగరంలోని బారాషహీద్ దర్గా వద్ద నుంచి కార్పొరేషన్ కార్యాలయం దాకా నాయకులు, కార్యకర్తలు ఎర్రజెండాలు చేతపట్టి ప్రదర్శన చేశారు. కత్తి శ్రీనివాసులు, మూలం శ్రీనివాస్, ఆర్.శ్రీనివాసులు, మస్తాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

# బీఎల్ఓలా!.. వైకాపా కార్యకర్తలా?

## మాజీమంత్రి సోమిరెడ్డి ధ్వజం



ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో ఓటర్ల జాబితాలు పరిశీలించే ప్రక్రియలో కొందరు బిఎల్ఓలు నిజాయితీగా విధులు నిర్వహిస్తుంటే మరికొందరు మాత్రం వైకాపా కార్యకర్తలుగా వ్యవహరిస్తున్నారని, ఓటర్ల జాబితాలు పరిశీలించేందుకు ఇంటింటికి వెళ్ళకుండా వైకాపా నాయకుల ఇళ్ళల్లో కూర్చుని నామ మాత్రంగానే పరిశీలన జరుపుతున్నారని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో ఆయన ఇటీవల విలేకర్లతో మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఆదేశాలను కొందరు బేఖాతరు చేస్తున్నారని విమర్శించారు. గడువు సమీపిస్తున్నా కొందరు బిఎల్‌ఓలు విధులకు దూరంగా ఉంటున్నారని, ఓటర్ల జాబితాల విషయంలో వలంటీర్లను దూరం పెట్టాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలను కూడా కొంతమంది పట్టించుకోవడం లేదన్నారు. చనిపోయినోళ్ళ ఓట్ల తొలగింపుకు సాకులు చెప్తున్నారని, డెత్ సర్టిఫికెట్ ఇస్తేనే ఆ ఓట్లను తొలగిస్తామనడం సరికాదన్నారు. కొత్త జాబితాలో ఎలాంటి అవకతవకలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత జిల్లా అధికారులు, రిటర్నింగ్ అధికారులదేనన్నారు.



## భవ్యహాసినికి..

# నోబెల్ వరల్డ్ రికార్డు


తమిళనాడులోని పవిత్ర పుణ్యక్షేత్రమైన అరుణాచలంలో గత నెల 23న భరతనాట్యం చేస్తూ 3.36 గంటల్లోనే 14 కిలోమీటర్ల గిరిప్రదక్షిణను పూర్తిచేసి అందరి ప్రశంసలందుకున్న నెల్లూరుకు చెందిన నల్లంగు భవ్యహాసినికి నోబెల్ వరల్డ్ రికార్డు లభించింది. ఈ సందర్భంగా స్థానిక అవెన్యూస్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ఆ విద్యార్థినిని ఆ స్కూల్ ప్రిన్సిపాల్ మీరా ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ సురేష్‌లు అభినందించి, భవ్య అదే స్ఫూర్తితో నాట్యంలో మరిన్ని అవార్డులు అందుకోవాలని, అందుకు భవ్యకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. కళాదీప్తి డాన్స్ ఇన్‌స్టిట్యూట్‌లో భరతనాట్య సాధన చేస్తూ భవ్యహాసిని ఈ అరుదైన అవార్డును అందుకోవడం విశేషం. గతకొద్దికాలంగా ఆ విద్యార్థిని జిల్లాలోని పలు దేవాలయాల్లో కూడా నాట్యప్రదర్శనలిచ్చి అందరి అభినందనలు అందుకుంది. భవ్యహాసిని నాట్యంలో మరింత ప్రతిభాపాటవాలతో రాణించి జాతీయ, అంతర్జాతీయస్థాయి అవార్డులు కూడా అందుకోవాలని నాట్యగురువులు 'కళాదీప్తి' సుబ్రహ్మణ్యం-కామాక్షిలు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## గంగానదిలో ప్రాణాలు కోల్పోయిన..

# కొడవలూరు ఇఓపిఆర్‌డీ



కొడవలూరులో ఇఓపిఆర్‌డీగా పనిచేస్తున్న వి.నాగరాజు(50) గంగానదిలో ప్రమాదవశాత్తూ మునిగిపోయి ప్రాణాలు కోల్పోయారు. నెల్లూరులో నివాసం ఉంటున్న ఆయన, తన చిన్న కుమారుడిని ఐఐటిలో చేర్చేందుకు ఇటీవల భార్య, కుమారులిద్దరితో కలసి అలహాబాద్‌కు వెళ్ళారు. అక్కడినుంచి తిరుగుప్రయాణంలో కాశీకి వెళ్ళి గంగా నది వద్ద గంగాహారతి చూడడానికి నదిలో పడవ ఎక్కుతుండగా ప్రమాదవశాత్తూ ప్రవాహంలో పడి గల్లంతయ్యాడు. రక్షణ బృందాలు గాలించినా కనిపించలేదు. ఎట్టకేలకు ఈనెల 18న ఆయన మృతదేహం లభ్యమైంది. ఈ సమాచారం అందుకున్న నెల్లూరుజిల్లా కలెక్టర్ హరి నారాయణన్ కాశీలోని అధికారులతో సంప్రదించి, అక్కడున్న నాగరాజు కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడి ప్రభుత్వ ఖర్చులతో ఆయన మృతదేహాన్ని కాశీలోనే ఖననం చేయించారు. నాగరాజు ఆకస్మిక మృతికి జిల్లాలోని పలువురు అధికారులు, ఉద్యోగులు తమ విచారం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# దిగ్విజయంగా చంద్రయాన్

## ఆగస్టు 23, 2023..

ఇది మానవాళి చరిత్రలోనే మరచిపోలేని రోజు. ఒక్క మన దేశంలోనే కాదు, భూమండలం మీదనే ఇదొక అద్భుతమైన రోజు. అందని జాబిలమ్మ అందిన రోజు.. మానవ మేధాశక్తి ఎంత అద్వితీయమైనదో తేటతెల్లమైన రోజు. ప్రపంచవ్యాప్తంగానే కాదు, విశ్వవ్యాప్తంగా భరతజాతి కీర్తిచంద్రికలు వెన్నెల కిరణాల్లా మెరిసిన రోజు. ఒకవైపు గతంలో చంద్రయాన్-2 ఆఖరి నిమిషాల్లో నిరాశపరచడం, తాజాగా ఇదే ప్రయోగాన్ని చేపట్టిన రష్యాకు చెందిన లూనా కూడా విఫలం కావడంతో, చంద్రయాన్-3 ప్రయోగం చివరిదశలో ఏమవుతుందోననే ఉత్కంఠ... మాటల్లో చెప్పలేనంత. అయితేనేం.. ఎట్టకేలకు చంద్రయాన్-3 భారతశాస్త్రవేత్తల కృషిని సఫలం చేసింది. చంద్రలోకంలో ఎవరూ అడుగుపెట్టని, భూమి మీద నుంచి ఎవరికీ కనిపించని చంద్రుని దక్షిణధ్రువం మీదకి మన విక్రమ్ ల్యాండర్ అత్యంత జాగ్రత్తగా..భద్రంగా అడుగిడింది. చంద్రమండలం మీది నుంచి మన రోవర్ పరిశోధనలకు ఉపక్రమించడమనే సన్నివేశాన్ని చూడగలగడం.. మనకెంత అదృష్టమో! ఈ తరం మానవాళికే ఆ వరం దక్కింది. ఉమ్మడి నెల్లూరుజిల్లా శ్రీహరికోటలోని షార్ నుంచి ప్రయోగించిన చంద్రయాన్-3 మిషన్ ఆ కలను మనందరికీ సాకారం చేసింది. జయహో చంద్రయాన్!.. సాహో భారత్..అంటూ ప్రపంచమే మురిసిపోయింది. భూమిపై సంధ్యాసమయం.. చంద్రునిపై సూర్యోదయం సమయంలో ప్రతిఫలిస్తున్న ఆ వెన్నెల కిరణాల మధ్య భారత మువ్వన్నెల పతాకం రెపరెపలాడడం సకల మానవాళికే గర్వకారణం.



## అత్యద్భుతమైన చంద్రుని ఛాయాచిత్రాలు

ఇక..చంద్రుడిపై మన ఆరుచక్రాల ప్రజ్ఞాన్ రోవర్ సెకనుకు ఒక సెంటీమీటర్ వంతున వేగంతో చంద్రునిపై నడక సాగిస్తూ పరిశోధనలను ప్రారంభించింది. రోవర్ పనిచేసేది కేవలం ఒకే ఒక్క పూట.. అది కూడా ఒక పగలు మాత్రమే. అయితే, అది భూమిపై 14 రోజులకు సమానం. పగటిపూట చంద్రుడిపై 170 డిగ్రీల సెల్సియస్ ఎండ ఉంటుంది. అదే రాత్రివేళలోనైతే ఉష్ణోగ్రత మైనస్ 180 డిగ్రీలకు పడిపోతుంది. అలాంటి క్లిష్టమైన వాతావరణంలో ప్రజ్ఞాన్‌రోవర్ 14 రోజులు పనిచేయాల్సి ఉంటుంది కనుక, అందుకు తగ్గట్టుగా రోవర్ తన పరిశోధన ప్రారంభించింది. చంద్రునిలో దాగి వున్న రహస్యాలను వెలికితీసేందుకు అనువైన సమాచారాన్ని అందించడానికి ప్రయత్నిస్తోంది. ఇప్పటికే చంద్రమండలంపై నుంచి భూమిమీదకి అద్భుతమైన, గుండెలకు హత్తుకునేంత అపూర్వమైన చంద్రుని ఉపరితల చిత్రాలను పంపుతోంది. చంద్రునిపై భారత్ మూడు సింహాల చిహ్నంతో, ఇస్రో – ఇండియా ముద్రతో తన పరిశోధన సాగిస్తోంది. భవిష్యత్తులో జరుగనున్న మరిన్ని ఉత్కంఠభరితమైన, ఆసక్తికరమైన పరిశోధనలన్నిటికీ శ్రీకారం చుడుతూ ముందుకు సాగుతోంది ప్రజ్ఞాన్ రోవర్. ఇది చరిత్రాత్మక విజయమని భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము శాస్త్రవేత్త లను అభినందించారు. ఇస్రో ఛైర్మెన్ డా.సోమనాథ్ సారథ్యంలో భారత శాస్త్రవేత్తలు సాధించిన ఈ విజయాన్ని దక్షిణాఫ్రికాలో ఉన్న భారతప్రధాని మోదీ వర్చువల్‌గా తిలకించి పులకించిపోయారు. శాస్త్రవేత్తల కృషిని ప్రశంసించి విజయానందం పంచుకున్నారు.

## ఉద్విగ్నం.. ఉత్కంఠ.. ఆనందం!

చంద్రుడిపై విక్రమ్ రోవర్ అడుగిడడానికి నిర్దేశించిన సమయం.. ఆగస్టు 23వ తేదీ సాయంత్రం..ఒక్క మన శాస్త్రవేత్తలకే కాదు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శాస్త్రవేత్తలు, కోట్లాదిమంది ప్రజలు ఉద్విగ్న భరితులయ్యారు. ఎప్పుడెప్పుడు సాయంత్రం అవుతుందా.. ఆ అపూర్వ సన్నివేశాన్ని కళ్లారా చూద్దామా అని ప్రసార మాధ్యమాల వద్ద నిరీక్షించారు. నిర్ణీత సమయమైన 5.44 గంటల నుంచి రఫ్ బ్రేకింగ్ దశ విజయ వంతంగా మొదలైంది. ఈ దశలో భూమిపై నుంచి ల్యాండర్ మాడ్యూల్‌కు ఎలాంటి సందేశాలు వెళ్లలేదు. పూర్తిగా ఆటోమేటిక్ ల్యాండిగ్ సీక్వెన్స్ ప్రకారం ప్రక్రియ కొనసాగింది. ఆటిట్యూడ్ హోల్డ్ దశ 10సెకన్ల పాటు కొనసాగుతూ, అప్పటి



దాకా అడ్డంగా ఉన్న విక్రమ్ ల్యాండర్ నిలువుగా నిలుస్తూ చంద్రుని ఉపరితలంపై దిగేందుకు సానుకూలంగా మారింది. ఇక అక్కడినుంచి ప్రతిక్షణం ఉత్కంఠే. 8 వందల మీటర్ల ఎత్తు నుంచి చంద్రుని ఉపరితలంపై అడుగిడేందుకు ల్యాండర్ సమాయత్తమైంది. 6గంటల సమయానికి 2 వందల మీటర్ల కంటే తక్కువ ఎత్తుకు చేరుకుంది. ఆ నిమిషంలో అందరి గుండెలు ఇంకా మరింత ఉద్విగ్నతకు గురయ్యాయి. సుమారు నూరు మీటర్ల ఎత్తుకు వచ్చాక ల్యాండర్ తనలోని సెన్సర్లు, కెమెరాలను ఉపయోగించుకుని చంద్రుని ఉపరితలాన్ని స్కాన్ చేసి తాను దిగే చదునైన ప్రదేశాన్ని నిర్ధారించుకుంది. సరిగ్గా నిర్దేశించిన సమయం ప్రకారం.. ప్రపంచమంతా వీక్షిస్తుండగా.. అశేష ప్రజలు చప్పట్లు మార్మోగిస్తుండగా విక్రమ్ ల్యాండర్ భద్రంగా.. సున్నితంగా.. సురక్షితంగా చంద్రునిపై అడుగుపెట్టి భారత్‌కు ఘన కీర్తిని తెచ్చిపెట్టింది.

## ఊపందుకోనున్న పరిశోధనలు

చంద్రయాన్-3 దిగ్విజయం కావడంతో దేశప్రజలు 'వందే మాతరం.. మనదే ఈ తరం' అంటూ సగర్వంగా చెప్పుకుంటున్నారు. మరోవైపు శాస్త్రవేత్తలు ఆ ఆనందసందోహాలను అందిపుచ్చుకుంటూనే.. విరామమెరుగకుండా తదనంతర పరిశోధనలకు సమాయత్తమవుతున్నారు. దీంతో, ప్రజ్ఞాన్ రోవర్ ఇచ్చే సమాచారంతో ఇక చంద్రమండలంపై పరిశోధనలు ఊపందుకోనున్నాయి. అక్కడున్న అపారమైన.. అద్వితీయమైన హీలియం, టైటానియం, థోరియం వంటి ఖనిజ నిక్షేపాల గుట్టుమట్లు వెలికిరానున్నాయి. అనేక ఖగోళ రహస్యాలు తెలిసేందుకు అవకాశాలున్నాయి. కోట్లాది సంవత్సరాల క్రితం ఆవిర్భవించిన భూమి, చంద్రుడు, సౌరకుటుంబం తదితరాల పుట్టుకలు, వాటి పరిణామక్రమాలు తెలుసుకునేందుకు పరిశోధనలు ముమ్మరం కానున్నాయి. చంద్రమండలంపై ఉన్న నీటి జాడల గురించి ప్రపంచానికి మొట్టమొదటిసారి తెలియ జెప్పింది కూడా మన శాస్త్రవేత్తలే. చంద్రయాన్-1 ద్వారా చంద్రునిపై గడ్డకట్టిన నీరున్నట్లు గుర్తించడం జరిగింది. ఇప్పుడు ఆ నీటిజాడల గురించి మరింత సమగ్రమైన వివరాలు తెలియనున్నాయి. అంతేకాదు, ఎంతోకాలంగా మానవులు వెన్నెలలోకంలో ఉంటే ఎంత బావుంటుందో..అని కలలు కంటున్నట్లుగా..అసలు చంద్రమండలంపై మానవునికి అక్కడ ఆవాసం దొరుకుతుందా?..ఆ వాతావరణం మానవునికి సరిపోతుందా లేదా అన్నది కూడా భవిష్యత్తులో తేలనుంది. చంద్రునిపైనుంచే ఇతర గ్రహాల రహస్యాలను తెలుసుకునేందుకు అన్వేషణ సాగనుంది. 'చంద్రయాన్' విజయంతో మరింత ముందుకు వెళ్తామని, అంగారకుడు, శుక్రుడు తదితర గ్రహాలపై కూడా ప్రయోగాలకు సిద్ధమవు తామని ఇస్రో ఛైర్మెన్ డా.సోమనాథ్ ధీమాగా చెప్తున్నారు.

## అగ్రరాజ్యాలు సైతం సాధించలేని విజయం :

గతంలో అగ్రరాజ్యాలైన అమెరికా, రష్యా, చైనాలు చందమామపై అడుగిడినా, చంద్రుని దక్షిణధ్రువం మీదకు వెళ్లాలనే ప్రయత్నాలు ఇంకా నెరవేరని నేపథ్యంలో.. చంద్రుడిపై పరిశోధనల కోసం గతనెల 14న నింగిలోకి దూసుకువెళ్లిన చంద్రయాన్-3 వ్యోమనౌక అంతరిక్షంలో 41 రోజుల సుదీర్ఘప్రయాణం తర్వాత ఎట్టకేలకు ఆగస్టు 23వ తేదీ సాయంత్రం 6గంటలా 4 నిమిషాలకు లక్ష్యాన్ని చేరుకుంది. చంద్రయాన్ మిషన్‌లోని ప్రజ్ఞాన్ రోవర్‌తో కూడిన విక్రమ్ ల్యాండర్ భద్రంగా చంద్రుని దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టి, అగ్రరాజ్యాలు సైతం సాధించలేని విజయాన్ని సొంతం చేసుకుంది. ప్రపంచంలోనే తొలిసారిగా చంద్రుని దక్షిణధ్రువంపై దిగిన ఘనతను సాధించి ఇస్రో అందరి జయజయధ్వానాలందుకుంది. 'అందెను నేడే..అందని జాబిల్లి' అంటూ ఓ సినీకవి ఎప్పుడో రాసిన గీతం కళ్లెదురుగా సాకారమై కనిపిస్తూ తెలుగువారి హృదయాలను ఆనందడోలికలూపింది. చంద్రయాన్-2 వైఫల్యం నుంచి నేర్చుకున్న పాఠాలతో చంద్రయాన్-3 ధైర్యంగా ముందడుగేసింది. ల్యాండర్ నుంచి సున్నితంగా బయటికొచ్చిన ప్రజ్ఞాన్ రోవర్ నాలుగేళ్ల క్రితం నాటి చేదుజ్ఞాపకాలను మరపిస్తూ భారత శాస్త్రవేత్తల కలను సాకారం చేస్తూ ముందుకు సాగుతోంది.

## అంతరిక్ష వాణిజ్య రంగంలో.. పెరుగుతున్న భారత్ ప్రతిష్ఠ :



ప్రపంచంలో ఇప్పటిదాకా 12 దేశాలు మాత్రమే చంద్రునిపై అడుగుపెట్టడానికి ప్రయోగాలు చేశాయి. కానీ, ఏ దేశం కూడా విజయవంతంగా చందమామ దక్షిణ ధ్రువాన్ని చేరుకోలేకపోయాయి. 2023 జులై 14న తెలుగుగడ్డ మీద నుంచి..శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్ నుంచి ఎల్‌వీఎం3-ఎం4 బాహుబలి రాకెట్ చంద్రమండల యాత్ర ప్రారంభించింది. ఆ రాకెట్ ద్వారా 1749.8 కిలోల బరువున్న ల్యాండర్ విక్రమ్‌ను మోసుకుని రివ్వుమంటూ నింగికెగిసింది. భూమి నుంచి అంతరిక్షంలోకి వెళ్ళిన చంద్రయాన్ మిషన్ భూకక్ష్యను దాటుకుని చంద్రమండలం వైపుకు మొత్తంగా.. 3.89 లక్షల కిలోమీటర్లు విజయవంతంగా ప్రయాణం సాగించింది. అది అన్ని దశల్లోనూ సాఫీగా ప్రయాణిస్తూ లక్ష్యాన్ని చేరుకోవడం విశేషం. ఈ ప్రయోగం ద్వారా జాబిల్లిపై భారత్ జయపతాక రెపరెపలాడడంతో అంతర్జాతీయ అంతరిక్ష వాణిజ్యరంగంలో భారత్ ప్రతిష్ఠ అనూహ్యంగా.. అమేయంగా పెరుగుతోంది.

కేవలం 615 కోట్ల రూపాయల అత్యంత తక్కువ వ్యయంతోనే భారత్ చేపట్టిన చంద్రయాన్ ప్రయోగం దిగ్విజయం కావడం ప్రపంచాన్నే ఆశ్చర్యపరచింది. అత్యంత తక్కువ ఖర్చుతో ఇంతటి ఘనత సాధించడం ఇస్రో ప్రత్యేకతకు, విశేష ప్రతిభాపాటవాలకు నిదర్శనం. దీంతో అంతరిక్ష ప్రయోగాల కోసం అనేక దేశాలు ఇస్రో వైపు చూసే అవకాశాలున్నాయి. అతి తక్కువ ఖర్చుతో ఇతర దేశాలకు చెందిన ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యల్లోకి చేర్చగలిగే సత్తా ఇస్రోకి ఉండడం, ఎన్నో దేశాలతో కలిసి అంతరిక్ష ప్రయోగాలు నిర్వహిస్తుండడం వంటివన్నీ ఇస్రోకి కలిసొచ్చే అంశాలే. ఇప్పటికే 34 దేశాలకు సంబంధించిన 381 ఉపగ్రహాలను ఇస్రోనుంచి విజయవంతంగా అంతరిక్ష కక్ష్యల్లోకి చేరడం మరో గొప్ప విశేషం. అపారమైన ధనాన్ని వెచ్చించి స్వయంగా ఉపగ్రహాలను నింగిలోకి పంపుకోలేని దేశాలు ఇక భారత్‌ను ఆశ్రయిస్తానడంలో ఎలాంటి సందేహం లేదు. దీంతో ఇస్రోకి అంతరిక్ష వాణిజ్య లాభాలు కూడా పుష్కలంగా ఉంటాయి. ఏదేమైనా, చంద్రయాన్-3 మన దేశానికి ప్రపంచవ్యాప్త ప్రతిష్ఠను, ఇస్రోకి లాభాల పంటను ఇస్తున్నదనడంలో ఎలాంటి సందేహం లేదు. జయహో చంద్రయాన్!..జయహో ఇస్రో!...జయహో భారత్!...

## అందాల చందమామ అందిన వేళ

అనంత విశ్వంలో
అందాల చందమామను
అందుకున్న కర్మభూమి
నింగిలోని నెలరేడు
పలకరించెను భారతావనిని
సప్తమిన సకల జనుల సంతసంతో
సుషుప్త దక్షిణ ధృవ రేరాజు
సంసిద్ధమై 'విక్రమ్'ను
సంబరంగా ఆహ్వానించె
వందలాది శాస్త్రవేత్తల కృషి
కోట్లాది భారతీయుల
ఫలించిన మనోరథం



రెప్పవేయక వీక్షించిన క్షణం..
విక్రమ్ క్షేమంగా
జాబిలి మీద జాలువారిన దృశ్యం..
జల జల రాలెను ఆనంద బాష్పం!
ల్యాండర్ విక్రమ్ నుండి
భరతమాత ముద్దుబిడ్డలకు
ప్రయోగాత్మక "ప్రజ్ఞ" కొరకు
ప్రయాణమైన రోవర్ ప్రజ్ఞాన్‌కు
జైహింద్!!

**- కమల పరవస్తు**
(శ్రీ చినజీయర్ స్వామి భక్తురాలు)

లాయర్
ఆగస్టు 25, 2023

# ఇది.. ఈ తరం సాధించిన అఖండ విజయం

"చందమామ రావే - జాబిల్లి రావే.." సుమారు ఆరు వందల సంవత్సరాల క్రితం పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యుడు రాసిన కీర్తన ఇది. కానీ, ఆ మామ మనవద్దకి రాలేదు. ఆరువందల సంవత్సరాల తరువాత మనమే ఆ చందమామ దగ్గరకి వెళ్ళాం. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, అసాధారణమైన మానవ మేధస్సుతో అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ఘనత మన భారతీయ శాస్త్రజ్ఞులది. ఇది ఈ తరం సాధించిన అఖండ విజయం. భవిష్యత్ తరాలు నిరంతరం గొప్పగా చెప్పుకునే చిరస్మరణీయ ఘట్టం. సాయంత్రం 6 గంటలా 3 నిముషాలకి దేశంలో సూర్యుడు అస్తమించే వేళ, చంద్రునిపై భారత దేశ ప్రతిభ ఉదయించింది. భారతీయుల శక్తి సామర్థ్యాల ప్రభ ప్రకాశించింది. భారతీయ విజ్ఞానం చంద్రుడిపై వెలుగులు ప్రసరింపచేసింది. ప్రపంచమంతా భారతీయుల ఖ్యాతి మారుమ్రోగింది.

శాస్త్రీయ విజ్ఞానంకంటే ముందుగా ప్రపంచానికి పరిచయమైన అద్భుతం ఖగోళ విజ్ఞానం. మనకు తెలియని ఎన్నో అద్భుతాలు, ఆసక్తికర విషయాలు ఖగోళ శాస్త్రం ద్వారా వెలుగులోకి వచ్చాయి.

సృష్టిలో ప్రాచీన నాగరికతలు విలసిల్లిన కాలంలోనే భారత దేశంలో వేదాలు ఉనికిలో ఉన్నాయి. వేదాలు ఏ కాలానికి చెందినవన్న విషయంలో ఖచ్చితమైన స్పష్టత లేదు, ఆధారాలు కూడా లేవు. కానీ, మన వేదాలలో ఖగోళ విజ్ఞానానికి సంబంధించిన అనేక శ్లోకాలు ఉన్నాయి. ముఖ్యంగా రుగ్వేదంలో రాశిచక్ర వర్ణన ఉంది. "పన్నెండు ఆకులు గల కాలచక్రం గగనంలో తిరుగుతోంది. ఆ చక్రం మీద 720 మిథునాలు ఉన్నాయి." అనే వర్ణన రుగ్వేద శ్లోకాల్లో ఉంది. భగవద్గీతలో విశ్వరూపాన్ని వర్ణించే శ్లోకాలు ఉన్నాయి. ఆది మధ్యాంతాలు లేని భూ గగన దిగంతమంతా విశ్వరూపంలో సాక్షాత్కరిస్తుందని, సమస్త చరాచర ప్రపంచం దానిలో ఏకకాలంలో కనిపిస్తుందని గీతలో వర్ణించారు. మరే దేశపు ప్రాచీన సాహిత్యంలోనూ అనంత విశ్వం గురించి ఇలాంటి కవితాత్మక వర్ణన కనిపించదు. భారతీయ ఖగోళ విజ్ఞానానికి మూలగ్రంథం 'సూర్య సిద్ధాంతం'. ఇది పూర్తిగా లభించలేదని మనకి చరిత్ర చెప్తుంది. శిథిలమైన కొన్ని లిఖిత ప్రతులు మాత్రమే దొరికాయని అంటారు. దీని కర్త ఎవరో, రచనా కాలమేదో తెలియదు. సూర్యుడు మయుడికి ఉపదేశించిన సిద్ధాంతమే ఈ గ్రంథం అని సంప్రదాయవాదులు భావిస్తారు. 'సూర్య సిద్ధాంతం' గ్రంథంలో దొరికిన భాగాలలోని విషయాల ప్రకారం భూమి వ్యాసం 1600 యోజనాలు. యోజనం అంటే దాదాపు 4.9 మైళ్ళు. ఈ లెక్కన 'సూర్యసిద్ధాంతం' ప్రకారం భూమి వ్యాసం 7,849 మైళ్ళు. ఇది నేటి లెక్కకు దాదాపు దగ్గరగానే ఉంది. ఆధునిక పరిశోధనల ప్రకారం భూమధ్య రేఖ వద్ద భూమి వ్యాసం 7,917.5 మైళ్ళు. భూమి నుంచి చంద్రునికి గల దూరం 51,566 యోజనాలుగా (2.53 లక్షల మైళ్లు) లెక్కగట్టింది 'సూర్యసిద్ధాంతం'. ఇది కూడా ఆధునిక లెక్కలకు దగ్గరగానే ఉంది. ఆధునిక పరిశోధనల ప్రకారం ఈ దూరం 2,38,900 మైళ్ళు. 'సూర్యసిద్ధాంతం' రచించిన నాటికి టెలిస్కోప్ వంటి పరికరాలేవీ అందుబాటులో లేవు. ఏ పద్ధతిలో ఈ లెక్కలను గుణించారో కూడా తెలియదు. 'సూర్య సిద్ధాంతం' తర్వాత భారతదేశం నుంచి వెలుగులోకి వచ్చిన గొప్ప ఖగోళ శాస్త్ర గ్రంథం 'ఆర్యభట్టీయం'. దీనిని క్రీస్తుశకం 476 ప్రాంతానికి చెందిన ఆర్యభట్టు రచించాడు. కాలాన్ని లెక్కించేందుకు జలగడియారం, ఛత్రయంత్రం వంటి పరికరాలను కనుగొన్నాడు. భూభ్రమణ వేగాన్ని, రోజు వ్యవధిని, గ్రహణ కాలాలను నిర్దుష్టంగా లెక్కగట్టాడు. గ్రహణాలు ఛాయల ప్రభావం వల్ల ఏర్పడతాయని తేల్చి చెప్పాడు. ఆర్యభట్టు తర్వాత మొదటి భాస్కరాచార్యుడు, బృహస్పతి, పరాశరుడు, వరాహమిహిరుడు, రెండవ భాస్కరాచార్యుడు ఖగోళ, గణిత, జ్యోతిష శాస్త్రాల్లో గణనీయమైన కృషిచేశారు. ఇవన్నీ మనకి ఆధారాలతో చరిత్ర చెప్తున్న సత్యాలు. ఇది మన దేశానికి మాత్రమే దక్కిన అపూర్వ ఘనత.

పుష్పక విమానం గురించి విన్నాం, ఇప్పుడు విమానాన్ని చూస్తున్నాం. మాయాదర్పణం గురించి వింతగా చెప్పుకున్నాం. ఇప్పుడు అంతర్జాలం ద్వారా ప్రపంచాన్ని చూస్తున్నాం.

నిన్నటి విజయంతో, శాస్త్రీయ పరిజ్ఞానంలో కూడా మనకెవరూ పోటీలేరని మనకిమనమే సాటి అని రుజువు చేసుకున్నాం. భూమికి దగ్గరగా ఉన్న ఏకైక ఉపగ్రహం చంద్రుడే. భూమిలో పావువంతు పరిమాణంలో చందమామ ఉంటాడు. చంద్రుడు.. అనగానే పున్నమి చంద్రుడు నుంచి సన్నని రేఖ చంద్రవంక వరకు అందరికీ గుర్తుకువస్తుంది. అయితే మన పూర్వీకులు చంద్రోదయం నుంచి పౌర్ణమి వరకు ఆయా తిథులలో చంద్రుడి ఆకారం, పరిమాణాలను లెక్కించారు. వాటికి అమృత, మానద, పూష, తుష్టి, సృష్టి, రతి, ధృతి, శశిని, చంద్రిక, కాంతి, జ్యోత్స్న, శ్రీ, ప్రీతి, అంగద, పూర్ణ, పూర్ణామృత అంటూ 16 రకాల పేర్లు పెట్టారు.

ఇప్పుడు అదే జాబిల్లి చెంతకు మనమెళ్లాం, రాబోయే రోజుల్లో ఇంకా ఆసక్తికర విషయాలు తెలుసుకోబోతున్నాం. 'విక్రం ల్యాండర్ 'ని చంద్రునిపై దింపే వరకు పట్టువదలని విక్రమార్కులలాగా రేయింబవళ్ళు శ్రమించి, అనుకున్నది సాధించి చంద్రుడిపై భారత కీర్తిపతాకాన్ని ఎగురవేసిన మన ఇస్రో శాస్త్రవేత్తల ప్రతిభా నైపుణ్యాతకి, అకుంఠిత దీక్షకి, అంకిత భావానికి శిరస్సు వంచి పాదాభివందనం చేయాల్సిందే...!

## శ్రీసిటీ ఉద్యానవనాలను సందర్శించిన విద్యార్థులు



శ్రీసిటీ ఫౌండేషన్, శ్రీసిటీ-శ్రీవాణి ఆధ్యాత్మిక సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఇరుగుళం, మాదనపాలెం ప్రభుత్వ హైస్కూళ్ల విద్యార్థులు ఇటీవల శ్రీసిటీని సందర్శించి పలు కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆరూరు నర్సరీ ప్రాంగణంలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించి, గోవింద నామాలను పఠించారు. పలు ఆధ్యాత్మిక కీర్తనలకు, జానపద పాటలకు నృత్యం చేసి అందరినీ అలరించారు. ఆ తర్వాత అక్కడున్న నర్సరీని సందర్శించారు. శ్రీసిటీ ఉద్యానవన అధికారులు నర్సరీలోని వివిధ మొక్కల రకాలను, వాటి పెంపకం, ఉపయోగాల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రకృతి, పచ్చదనం, మొక్కలకు సంబంధించి క్విజ్ నిర్వహించి విద్యార్థులకు శ్రీసిటీ తరఫున బహుమతులందచేశారు. రెండు స్కూళ్లలోని 8,9,10 తరగతులకు చెందిన సుమారు 75 మంది విద్యార్థులు, 10 మంది ఉపాధ్యాయులు ఈ సందర్శనలో పాల్గొన్నారు. విద్యార్థులందరికీ శ్రీసిటీ నోటు పుస్తకాలు, పెన్లు, మాండెలెజ్ వారి 'మేడ్ ఇన్ శ్రీసిటీ' క్యాడ్బరీ చాక్లెట్ల గిఫ్ట్ హాంపర్లు, అన్నప్రసాదాలు అందచేశారు. శ్రీసిటీ ఉద్యానవన అధికారి మధురెడ్డి, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్, పల్లేటి బాలాజీ తదితరులు పర్యవేక్షించారు.

## రాజకీయాలలో సినిమా గ్లామర్ ఇక పనిచేయదు!

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో రోజుకో కొత్త చర్చకి తెరలేస్తోంది. తాజాగా చిరంజీవి మళ్ళీ రాజకీయాలలోకి వస్తాడా...? అన్న చర్చ ఈమధ్య ఎక్కువగా వినిపిస్తోంది. గతంలోలాగా సినిమావాళ్ళ చరిష్మా ఇప్పటి రాజకీయాలలో పెద్దగా ప్రభావం చూపించకపోవచ్చు. పిఆర్‌పి అనే పార్టీని స్థాపించి ఎంఆర్‌పికి టిక్కెట్లను అమ్ముకున్న చరిత్ర చిరంజీవిది. అంతే కాదు, ఢిల్లీ పార్టీకి సలాం కొట్టి, వారి గులాంగా ప్రజారాజ్యాన్ని దగారాజ్యంగా మార్చి మంత్రిపదవి తీసుకున్నాడాయన. ఇప్పుడు మళ్ళీ తగుదునమ్మా అంటూ ఆయన ప్రత్యక్ష రాజకీయాలలోకి వస్తే ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. ఇక ఆయన తమ్ముడు పవన్ కళ్యాణ్ సరేసరి. గత ఎన్నికలలో తాను పోటీచేసిన రెండు సీట్లలో కూడా ఓడిపోయాడు. సినిమావాళ్లంతా ఒక్కటైతే, వాళ్ళ అభిమానుల కారణంగా కొంత శాతం ఓట్లు చీలే అవకాశం మాత్రమే ఉంది. అది ఇతర పార్టీల గెలుపోటములపై ప్రభావం చూపగలదేమో! అంతే తప్ప సినిమా వాళ్ళని ముఖ్యమంత్రి స్థానంలో కూర్చోబెట్టేంత సీన్ లేదు. తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ అంతటివాడే రాజకీయ అరంగేట్రానికి ముహూర్తం పెట్టుకుని వెనక్కి తగ్గాడు, మరి రాజకీయ పరిపక్వత లేని ఈ తెలుగు సోదరులెంత...? ఆంధ్రాలో పవన్ కలలు కంటున్నట్లుగా ఆయన ముఖ్యమంత్రి కావడం మాత్రం ఈ జన్మకి కలే..! – ఎం.చంద్రమౌళి, కొత్తఢిల్లీ.

## మాగుంట లే అవుట్.. కేరాఫ్ కరంట్ కట్!




మాగుంట లే అవుట్ అంటే నెల్లూరు జూబ్లీహిల్స్‌గా ప్రసిద్ధి. నగరంలోని ప్రముఖుల ఇళ్ళు, వ్యాపార సంస్థలకు నిలయం మాగుంట లే అవుట్. ముఖ్యంగా మాగుంట లే అవుట్ మెయిన్ రోడ్డులో అనేక బ్యాంకులు, కార్యాలయాలు, సూపర్ మార్కెట్‌లు, ఫుడ్ జాయింట్లు, రెస్టారెంట్లు, కాఫీ షాపులు ఇబ్బడి ముబ్బడిగా వెలిశాయి. మినీ బైపాస్ కూడా వ్యాపార సామ్రాజ్యంగా శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. అలాంటి మాగుంట లే అవుట్ పవర్ కట్‌లకి చిరునామాగా మారిపోయింది. వేళాపాళా లేకుండా రోజులో కనీసం 10సార్లన్నా కరెంటు పోతోంది. చిన్నపాటి గాలి వచ్చినా, నాలుగు చినుకులు పడినా పరిస్థితి మరీ అధ్వాన్నం. ఇదేమిటయ్యా అని సిబ్బందిని, అధికారులను అడిగితే కుంటిసాకులు చెప్తున్నారు. మాకు ముందు పనిచేసినవారు నాసిరకం పరికరాలను వాడారని, చెట్లు వాటి ఇష్టానుసారం పెరిగిపోయాయని, ఉడత పడి ఫీజు పోయిందని... ఇలాంటి కథలు వినిపిస్తుంటారు. ఈ అనధికార కరెంటు కోత కాకుండా మళ్ళీ మెయింటెనెన్స్ పేరుతో పత్రికలలో ప్రకటన ఇచ్చి మరీ గంటలకొద్దీ కరెంటు తీసేస్తారు. మరి మెయింటెనెన్స్ సమయంలో చెట్ల కొమ్మలు తొలగించకుండా ఏం చేస్తారో అర్థం కాదు. మొత్తానికి మాగుంట లే అవుట్ కేరాఫ్ పవర్ కట్ అనే పేరు మాత్రం వచ్చేసింది..! – కే.ఎస్.రెడ్డి, మాగుంట అవుట్.

## నడకదారికి.. ఫెన్సింగ్‌తోనే భద్రత

తిరుమల నడకదారిలో భక్తులు జంతువుల బారినపడకుండా భద్రంగా ఉండేందుకు వెంటనే నడకదారికి పటిష్టంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం అవసరం. భక్తుల భద్రత ముఖ్యం కనుక తిరుమల తిరుపతి దేవస్థానాల వారికి నిధుల కొరత లేదుగనుక ఫెన్సింగ్ ఏర్పాటుకు ఎంత ఖర్చైనా ఆ ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి.

జె.ఎస్.ఆర్.కృష్ణ, చంద్రగిరి.

## చందమామపై భారత్ జయకేతనం

చంద్రయాన్-3 ద్వారా జాబిల్లి దక్షిణధ్రువంపై విజయవంతంగా 'లాండర్'ను దించిన 'ఇస్రో' శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియజేస్తున్నాను. ప్రపంచవ్యాప్తంగా అత్యంత అరుదైన గుర్తింపు పొందిన మొట్టమొదటి దేశంగా భారత్ నిలవడం ఎంతో గర్వకారణం. భవిష్యత్తులో ఇంకా ఎన్నో అంతరిక్ష ప్రయోగ విజయాలను మనదేశం సాధిస్తుందని నేను ఆశిస్తున్నాను.

డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం,
విశ్రాంత ప్రిన్సిపల్ & ఫిజిక్స్ హెడ్, వీ.ఆర్.కళాశాల, నెల్లూరు.

## గ్రామాల్లో గంజాయి నిజమే!

గత వారం మన 'లాయర్'లో మాదకద్రవ్యాలపై వచ్చిన వార్త ముమ్మాటికీ నిజం. ముఖ్యంగా గ్రామీణ యువత ఈ మత్తుబారిన పడి తమ జీవితాలు నాశనం చేసుకుంటున్న వైనాన్ని చక్కగా విశ్లేషించారు. మాది నెల్లూరు – కడప – ప్రకాశం జిల్లాల సరిహద్దు ప్రాంతం కావడం, ఇక్కడ కొండలు గుట్టలు అధికంగా ఉండడంతో ఈ పరిసరాలలో గంజాయి ప్రభావం చాలా ఎక్కువగా కనిపిస్తోంది. గంజాయిని పెంచడం, అమ్మడంతో పాటు సేవించే వారి శాతం కూడా బాగా పెరిగింది. 'లాయర్'లో రాసినట్టు ఎక్కువమంది యువత ఇందులో భాగస్వాములవుతుండడం గమనార్హం. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణం వంటివి మచ్చుకైనా కనపడకపోవడంతో యువతకి ఉపాధి అవకాశాలు కరువై ఇలా తప్పుదోవ పడుతున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ ఓ వైపు డబ్బు సంపాదిస్తూ.. మరోవైపు చెడు అలవాట్లకు బానిసలవుతున్నారు. ఈ మాదకద్రవ్యాల విషయంలో ప్రభుత్వం తీవ్రంగా స్పందించి ఉక్కుపాదం మోపకపోతే యువత భవిష్యత్తు నాశనం కావడం తథ్యం..! – షేక్ జిలాని భాషా, ఉదయగిరి.

గద్దర్.. అంటే ప్రజాకవి, ప్రజాగాయకుడు, ప్రజాయుద్ధనౌక. జీవితాంతం సామాన్య ప్రజల కోసం, సామాజిక చైతన్యం కోసం తపించిన మహాయోధుడు. ఆవేశంగా ఆయన పాడే పాటలన్నా, మాట్లాడే మాటలన్నా ప్రజలకు ఎంతో ఇష్టం. దేశవ్యాప్తంగా కోట్లాదిమంది ఆయనకు అభిమానులున్నారు. ఆయన కోసం ప్రాణాలిచ్చేవారు కూడా ఉన్నారు. పైన గొంగడి కప్పుకుని, కాళ్ళకు గజ్జెలు కట్టుకుని, చేత కర్రపట్టుకుని ఆయన ఉద్వేగంగా ప్రజాగానం చేస్తుంటే ప్రేక్షకులు మంత్రముగ్ధులైపోతుంటారు. అలాంటి విశేష ప్రతిభా పాటవాలున్న ప్రజా పోరాటయోధుడు గద్దర్‌పై గతంలో కాల్పుల దాడి జరగడం, ఆరు బుల్లెట్లు ఆయన శరీరంలోకి దూసుకుపోవడం, అయిదు బుల్లెట్లను తీసివేయగలిగినా, ఒక బుల్లెట్ ఆయన దేహం విడిచిపెట్టేదాకా ఆయనలోనే ఉండిపోవడం ఒక విషాదకర ఘట్టం. అసలు ఆయనపై కాల్పులు జరిపింది ఎవరు?..ఎందుకు దాడిచేశారు?..అనే విషయాలు దాదాపు గత ఇరవైఆరేళ్ళుగా అంతుపట్టనివిగానే మిగిలిపోయాయి. తనపై ఎవరు దాడిచేశారో దర్యాప్తు చేసి తేల్చండని గద్దర్ ప్రభుత్వాలకు విన్నవించినా ఫలితం లేదు. చివరికి..తనపై ఎవరు ఆ దాడికి పూనుకున్నారో తెలియకుండానే గద్దర్ ఇటీవల కన్నుమూశారు. ఆ సంచలనాత్మక విషయాల గురించి ప్రముఖ న్యాయవాది, గద్దర్‌కు ఆత్మీయుడు, ఆప్తమిత్రుడైన పట్టాభి..ఆనాటి కాల్పుల ఘటన గురించి తాజాగా అనేక ఆసక్తికరమైన అంశాలను ప్రసారమాధ్యమాల ద్వారా బహిరంగంగా వెల్లడించారు. పట్టాభి ఎవరో కాదు..! మన నెల్లూరీయుడే. నెల్లూరులో పేరుగాంచిన సీనియర్ న్యాయవాది దివంగత వేములపాటి అనంతరామయ్య కుమారుడు. ఆయన మాటల్లో.. ఆ వివరాలిలా ఉన్నాయి.



# గద్దర్‌తో నా గతం

## ప్రముఖ న్యాయవాది పట్టాభి మనోగతం

ప్రజలను బానిసతనం నుంచి, బానిస స్వభావాల నుంచి విముక్తం చేయాలని, మనిషిలో మానవత్వం పెంపొందించాలని, మానవుడు సంపూర్ణంగా బతకాలనే ఆశయంతో, తన పాటలు, కవిత్వం, నృత్యాలతో ప్రజలకు చైతన్యం కలిగిస్తూ ప్రజల మేలుకోసం

> మా పక్కింట్లోనే అప్పట్లో కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య ఉండేవారు. మహాకవి శ్రీశ్రీ, ప్రముఖ స్వాతంత్ర్యయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య, నక్సల్బరీ నాయకుడు తరిమెల నాగిరెడ్డి, విప్లవ నాయకులు కొండపల్లి సీతారామయ్య, పౌరహక్కుల న్యాయవాది కేజీ కన్నాభిరాన్ వంటి ప్రముఖులెందరో అప్పట్లో మా నాన్నగారిని కలిసేవారు.

ఆజన్మాంతం తపించిన ప్రజాకవి గద్దర్. ఆయనంటే నాకెంతో అభిమానం. నేను ఆయన్ను గౌరవంగా 'గద్దరన్న' అనే పిలుస్తుంటాను. నెల్లూరులో ప్రఖ్యాత న్యాయవాది అయిన మానాన్న దివంగత వేములపాటి అనంతరామయ్య గతంలో కమ్యూనిస్టుపార్టీ సభ్యులుగా, ఆ పార్టీ మద్దతుదారునిగా ఉండేవారు. మా పక్కింట్లోనే అప్పట్లో కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య ఉండేవారు. మహాకవి శ్రీశ్రీ, ప్రముఖ స్వాతంత్ర్యయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య, నక్సల్బరీ నాయకుడు తరిమెల నాగిరెడ్డి, విప్లవ నాయకులు కొండపల్లి సీతారామయ్య, పౌరహక్కుల న్యాయవాది కేజీ కన్నాభిరాన్ వంటి ప్రముఖులెందరో అప్పట్లో మా నాన్నగారిని కలిసేవారు. గద్దరంటే మా నాన్నకెంతో ఇష్టం. తన సొంతబిడ్డలా చూసుకునేవారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో చదువుకునేటప్పుడు మా తమ్ముడు అజయ్‌కుమార్ గద్దర్‌కు ప్రాణస్నేహితునిగా ఉండేవాడు. అలా దాదాపు 45 ఏళ్లుగా మా నాన్నకు బిడ్డగా, నాకు అన్నగా, మా తమ్ముడికి మిత్రునిగా గద్దరన్న మా కుటుంబసభ్యుల్లో ఒకరుగా కలసిపోయారు. మా కుటుంబానికి, గద్దరన్నకు ఉన్న ఆత్మీయానుబంధం అలాంటిది.

### ఆ రోజేం జరిగిందంటే..

1997 ఏప్రిల్ 6వ తేది నాకింకా బాగా గుర్తుంది. గద్దర్‌పై ఎవరో అగంతకులు కాల్పులు జరిపిన రోజది. మా తమ్ముడు అజయ్ నాకు ఫోన్‌చేసి ఆ విషయం చెప్పడంతోనే నేను హుటాహుటిన గద్దర్ ఇంటికి వెళ్ళాను. అక్కడ పరిస్థితంతా అల్లకల్లోలంగా ఉంది. గద్దర్‌ను హైదరాబాద్‌లో గాంధీ ఆసుపత్రికి తీసుకువెళ్లడంతో నేను అక్కడికి వెళ్ళి చూశాను. ఆయన్ను ఒక స్ట్రెచ్చర్ మీద పడుకోబెట్టి ఉన్నారు. చికిత్సకు అక్కడ సరైన పరికరాలు లేవు. ఆయన శరీరం మీద సరిగ్గా వస్త్రాలు కూడా కప్పలేదు. ఆ పరిస్థితి చూసి నాకు కన్నీళ్ళొచ్చాయి. చంద్రబాబునాయుడి ప్రభుత్వ హయాంలో ఈ ఘటన జరిగింది. నాకు చంద్రబాబునాయుడు కూడా బాగా తెలుసు. ఎంఏ ఫైనలియర్ చదువుకునేటప్పుడు ఆయన నాకు పరిచయం. వెంటనే ఆయనకు ఫోన్‌చేసి చెప్పాను. 'నేను మా అధికారుల్ని పంపుతాను. వెంటనే నిమ్స్‌కు తీసుకురండి' అని చెప్పారాయన. అంతేకాదు, 'మీకు నేను అన్నివిధాలా సపోర్ట్ చేస్తాను. ఆర్థికంగా కూడా సాయం అందిస్తాను. ఆయన్ను కాపాడాలి'.. అని చంద్రబాబు నాతో అన్నారు. గద్దరన్నను అక్కడినుంచి అంబులెన్స్‌లో నిమ్స్‌కు తరలిస్తుంటే నేను స్కూటర్‌పై వెంట వెళ్ళాను. ఆసుపత్రి వద్దకు ప్రతిపక్షాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పెద్దసంఖ్యలో వచ్చారు. గద్దర్‌కు ఆత్మీయులైన చక్రపాణి, అల్లం నారాయణ, పాశం యాదగిరి, ఖాదర్ తదితరులంతా ఆసుపత్రిలోనే ఉన్నారు. నాటి వైద్యశాఖ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి కూడా వచ్చారు. నేను నిజాం ఆసుపత్రి డైరెక్టర్ డా.భాస్కర్‌ను సంప్రదించి, ప్రముఖ గుండె వైద్య నిపుణులైన డాక్టర్ ధర్మరక్షక్, డా.శాస్త్రిగార్లకు ఫోన్ చేసి 'గద్దరన్న తెలుగుజాతి సంపద అని, ఆయన్నెలాగైనా కాపాడాలని కోరాను. వారు వెంటనే శస్త్ర చికిత్సలు చేశారు. అయిదు బుల్లెట్లు వెలికితీశారు. శ్వాసకు ఇబ్బందని మిగిలిన ఒక బుల్లెట్‌ను అలాగే వదిలేశారు. ఎలాగైతేనేం ఆ ఇద్దరి డాక్టర్ల కృషివల్ల, దేవుడి దయవల్ల గద్దరన్న ప్రాణాలతో బతికివచ్చారు. గద్దర్ ప్రజల మనిషి కాబట్టి బతికాడు. అయితే, ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఏప్రిల్ 6నే కాదు, అంతకుముందు ఏప్రిల్ 1న కూడా దాడులు జరిగాయి. పౌరహక్కుల నేత కేజీ కన్నాభిరాన్ ఇంటిపైనా, గద్దరన్న ఇంటిపైనా దుండగులెవరో దాడిచేశారు. ఆ దాడినుంచి గద్దరన్న తప్పించుకున్నారు. అయితే, తనమీద అలా దాడులు జరుగుతున్నా గద్దరన్న ఎలాంటి ముందుజాగ్రత్తలు తీసుకున్నట్లు కనిపించలేదు.

> 'నేను మా అధికారుల్ని పంపుతాను. వెంటనే నిమ్స్‌కు తీసుకురండి', 'మీకు నేను అన్నివిధలా సపోర్ట్ చేస్తాను. ఆర్థికంగా కూడా సాయం అందిస్తాను. ఆయన్ను కాపాడాలి'.. అని చంద్రబాబు నాతో అన్నారు.

### కాల్పులపై విచారణ జరగనే లేదు

అప్పట్లో ప్రభుత్వం నక్సలైట్లను బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తుండేది. వారి మృతదేహాలను పోస్ట్‌మార్టం కూడా చెయ్యకుండా తగులబెట్టేసేవారు. తల్లితండ్రులకు, వారి కుటుంబసభ్యులకు ఆ మృతదేహాలను అప్పగించాలని ప్రభుత్వాన్ని ధిక్కరించి గద్దర్ పోరాటం చేసేవారు. బహుశా అందుకే ఆయనపై దాడులు జరిగివుంటాయని, గ్రీన్‌టైగర్స్ పేరుతో ఎవరో అలా కాల్పులకు తెగబడి ఉండొచ్చని అప్పట్లో ప్రజలు అనుకునేవారు. అయితే, చంద్రబాబునాయుడే ఆ పని చేయించివుంటాడా లేదా అనేది చెప్పడానికి ప్రత్యక్ష సాక్షులెవరూ లేరు. కానీ, చంద్రబాబు చేయించి వుంటాడనే అనుమానాలు కూడా వచ్చాయి. ప్రభుత్వ విధానాలను తాను ధిక్కరించినందువల్లనే తనపై ప్రభుత్వం దాడి చేయించిందని గద్దర్ కూడా అనుకునేవారు. అయితే, వాస్తవానికి తనపై ఎవరు దాడిచేశారో నిర్ధారణ కాలేదు కనుక, విచారణ చేయించాలని ఆయన అప్పట్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విన్నవించుకున్నారు కానీ, ఇప్పటికీ అలాంటి విచారణేదీ జరగనే లేదు. ఎట్లయితేనేం..'నేను బతికొచ్చాను.. మళ్ళీ ప్రజా పోరాటం సాగిస్తాను' అంటూ గద్దర్ జీవితాంతం తన పాటలతో ప్రజాచైతన్యం కోసం తపించారు. వెట్టిచాకిరీ వద్దు..బానిసలుగా బతకొద్దు అనేవారు. అణచివేతకు, అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడారు. పేదలపైనే కాదు, పోలీసుల దయనీయ జీవితాలపై కూడా పాటలు రాసి పాడారు. ఆయనెప్పుడూ రాజ్యాంగానికి వ్యతిరేకం కాదు. మన రాజ్యాంగం ఒక జీవనది అనేవారు. రాజ్యాంగమంటే తల్లిలాంటిదని చెప్పేవారు. ఆయన మానవతావాది. చివరికి వీధికుక్కలను చూసి జాలిపడి కన్నీళ్లు పెట్టుకునేవారు. వాటిపై కూడా పాటలు రాసి పాడారు.

## ➤ ఆయన ఒక వ్యక్తి కాదు..సామాజిక శక్తి!

> ఎట్లయితేనేం..'నేను బతికొచ్చాను.. మళ్ళీ ప్రజా పోరాటం సాగిస్తాను' అంటూ గద్దర్ జీవితాంతం తన పాటలతో ప్రజాచైతన్యం కోసం తపించారు. అణచివేతకు, అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడారు. పోలీసుల దయనీయ జీవితాలపై కూడా పాటలు రాసి పాడారు.

### ప్రజలకు న్యాయం చేయాలన్నదే ఆయన ధ్యేయం

ప్రజలకు న్యాయం చేయాలన్నదే తన కోరిక అని, అయితే అందుకు తానొక్కడినే చాలనని, ప్రజలకు మంచి చేయడానికి రాజకీయ బలం కూడా ఉండాలని గద్దరన్న పదేపదే చెప్పేవారు. అర్జునుడు యుద్ధం చేయడానికి సాహసించలేక నిస్సహాయుడై అస్త్రాలను కిందపడవేసినప్పుడు శ్రీకృష్ణుడు కర్తవ్యబోధ చేసినట్లు, సమానహక్కుల కోసం ప్రజలు ధైర్యంగా పోరాడాలంటూ గద్దర్ తన పాటలతో ప్రజలకు చైతన్యం నూరిపోశారు. దురదృష్టవశాత్తూ ఇటీవల గద్దరన్న చనిపోయాక ఆసుపత్రి వద్దకు ఎందరో ప్రముఖులు వచ్చారు. గద్దరన్న గొప్పతనాన్ని నాయకులు కొనియాడారు. కానీ, గద్దర్‌పై కాల్పులు జరిపినప్పుడు మాత్రం వాళ్లెవరూ పట్టించుకోలేదు. వామపక్షాల వారు, ప్రజాసంఘాల వారు ఆయన్ను అక్కున చేర్చుకునేవారు. ఆయన మరణించాక పార్థివదేహాన్ని తొలుత ఇంటికి తీసుకువెళ్ళాలని అనుకున్నా, చివరికి ప్రజల సందర్శనార్థం లాల్‌బహదూర్ స్టేడియంకు తీసుకువెళ్ళాలని చాలా సేపటి తర్వాత నిర్ణయించారు. ఆ నిర్ణయం తీసుకోవడంలో కూడా జాప్యం జరగడం బాధాకరం. ఆరోజు బాగా వానొచ్చినా ప్రజలు వేల సంఖ్యలో వచ్చి గద్దరన్నని కడసారి చూసి నివాళులర్పించారంటే ఆయనపై ప్రజలకున్న అభిమానం అలాంటిది.

### ఓ మంచిమనిషిని కాపాడాలన్నదే మా తపన

మా నాన్న నెల్లూరులో దివంగతులైనప్పుడు కూడా గద్దర్ నెల్లూరుకు వచ్చి నాన్నగారి అంత్యక్రియల్లో పాల్గొని పాటలు పాడుతూ దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ల దూరం నడిచారు. మా కుటుంబంపై ఆయనకున్న ఆత్మీయత అలాంటిది. అందుకే, ప్రజల కోసం పోరాడే ఒక పవిత్రమైన వ్యక్తిని, సమాజం బాగుకోసం పోరాటంచేసే ప్రజాయోధుడిని కాపాడుకోవాలన్నదే వ్యక్తిగతంగా మా తపన తప్ప, మేమేమీ ఏ ఉద్యమాల్లో ఉండలేదు..ఏ పార్టీలోనో మేం ఉండేవాళ్ళం కాదు. గద్దర్ బాగుండాలని కోరుకున్నాం.. ఆరోగ్యం బాగయ్యాక మేం ఆయనకు దూరంగానే ఉండేవాళ్ళం. ప్రస్తుత రాజకీయనాయకులకు గద్దరన్నకు పోలికే లేదు. సూర్యుడు అందరిపై ప్రభావం చూపినట్లు ఆయన కూడా తన పాటల ద్వారా సమాజాన్ని ప్రభావితం చేశారు. ఆయన ఏ ఒక్క పార్టీకో సొంతం కాదు. అన్నిపార్టీల వారు ఆయన్ను అభిమానించేవారు.

ఒక్కమాటలో చెప్పాలంటే.. ప్రజలకోసం పుట్టిన అవతారపురుషుడు గద్దర్. ఆయన ప్రజల గొంతుక.. ప్రజల మనిషి..కారణజన్ముడు!...

> అర్జునుడు యుద్ధం చేయడానికి సాహసించలేక నిస్సహాయుడై అస్త్రాలను కిందపడవేసినప్పుడు శ్రీకృష్ణుడు కర్తవ్యబోధ చేసినట్లు, ప్రజల సమానహక్కుల కోసం గద్దర్ తన పాటలతో ప్రజలకు చైతన్యం నూరిపోశారు.

# నెల్లూరు కబుర్లు

## జయభారత్‌లో..'డయాలసిస్' విభాగం విస్తరణ



నెల్లూరులోని ప్రముఖ వైద్యశాల జయభారత్ హాస్పిటల్‌లో కొత్తగా డయాలసిస్ విభాగం ఏర్పాటు చేశారు. భగవాన్ మహావీర్ చారిటబుల్ ట్రస్ట్-నెల్లూరు వారి సహకారంతో నిర్వహిస్తున్న డయాలసిస్ యూనిట్‌ను 14 పడకల నుంచి 22 పడకలుగా విస్తరించారు. ఈనెల 20న పూజా కార్యక్రమం నిర్వహించి ఆ కొత్త విభాగాన్ని సింహపురి వైద్య సేవాసమితి అధ్యక్షులు పొన్నలూరు సీతారామరెడ్డి, జై మహావీర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సురేష్ జైన్, పరస్మాల్ జైన్ తదితరులు ప్రారంభించారు. నెల్లూరు ప్రజలకు, ముఖ్యంగా డయాలసిస్ అవసరమయ్యేవారికి అందు బాటులో ఉండేలా ఈ విభాగం ఏర్పాటు చేయడం సంతోషకరమని, ఒంగోలు వాస్తవ్యులు బదరీనాథ్, జై మహావీర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఈ విస్తరణకు సహకరించారని డాక్టర్ సురేంద్రకుమార్ చెప్పారు. డయాల సిస్ యూనిట్‌కు సహకరిస్తున్న వారందరికీ డాక్టర్ సివి సుబ్రహ్మణ్యం ధన్యవాదాలు తెలిపారు. సింహపురి వైద్య సేవాసమితి ఉపాధ్యక్షులు బాలు సుబ్బారావు, ప్రధానకార్యదర్శి హరికుమార్‌రెడ్డి, కోశాధికారి గుర్రం సుధాకర్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్వర్ణ మహాలక్ష్మికి క్షీరాభిషేకం



నెల్లూరు దర్గామిట్ట సుజాతమ్మ కాలనీలోని అవధూత దత్తపీఠం ఆధ్వర్యంలోని శ్రీకృష్ణయోగ మందిర ప్రాంగణంలో ఉన్న అష్టలక్ష్మీ మంది రంలో తొలిశ్రావణ శుక్రవారం రోజున మూలవిరాట్ శ్రీ స్వర్ణమహాలక్ష్మి అమ్మ వారికి ఆలయ అర్చకులు భక్తిశ్రద్ధ లతో క్షీరాభిషేకం చేశారు. సంప్ర దాయ బద్ధంగా పూజలుచేసి, అష్ట లక్ష్ములకు అర్చనలు చేశారు. మందిరం ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, ట్రస్టీలు ప్రమీలమ్మ, రాజశేఖర్, సురేష్, గిరి, రుషేంద్రబాబు తదితరులు పర్యవేక్షించారు.



### ఇస్కాన్ మందిరంలో...

## ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు

శ్రీకృష్ణాష్టమి సందర్భంగా నెల్లూరులోని ఇస్కాన్ మందిరం ఈనెల 20న చిన్నారుల వివిధ దేవతల వేషధారణలతో కళకళలాడింది. శ్రీకృష్ణుడు, గోపికలు, శ్రీరాముడు, సుధాముడు, నారదుడు, హనుమంతుడు, లక్ష్మీదేవి, గణేష్, శంకరుడు తదితర వేషాలతో చిన్నారులు అందరినీ ఆకట్టుకున్నారు. ఇస్కాన్ మందిరం ఛైర్మెన్ శుకదేవస్వామి మాట్లాడుతూ, దాదాపు రెండువేల మంది చిన్నారులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. చిన్నారుల్లో భక్తితత్వాన్ని, నైతిక విలువలను పెంపొందించేందుకు ఇస్కాన్ మందిరం తరపున ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ పోటీలతో పాటు భగవద్గీత కంఠస్త శ్లోకాలు, చిత్రలేఖనం తదితర పోటీలు కూడా నిర్వహించామని, పెద్దలకు-చిన్నారు లకు వేరువేరు విభాగాలుగా పోటీలు ఏర్పాటుచేశామని చెప్పారు.

## రెడ్‌క్రాస్‌లో..చిరు అభిమానుల రక్తదానం



మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు(ఈనెల 22)ను పురస్కరించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ రక్తనిధిలో ఈనెల 20న చిరు అభిమానులు రక్తదాన శిబిరం నిర్వహించి రక్తదానం చేశారు. ఇంద్ర, రబ్బాని ఆధ్వర్యంలో జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు కారంపూడి కృష్ణారెడ్డి, రాష్ట్ర చిరంజీవి యువత ఉపాధ్యక్షులు ఏటూరి రవికుమార్ సమక్షంలో చిరంజీవి ముందస్తు జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం చిరంజీవి అభిమానులు సుమారు 150 యూనిట్లు రక్తదానం చేశారు. రక్తనిధి కన్వీనర్ సి.హెచ్.అజయ్‌బాబు, రెడ్‌క్రాస్ మెడికల్ షాప్ కన్వీనర్ యు.మురళీకృష్ణ, రక్తదాన శిబిరం నిర్వాహకులను అభినందించారు. ఏ. సాయిరాం, మోటివేటర్ యం.మధుసూదన్‌రావు, రక్తనిధి సిబ్బంది కృష్ణవేణి, ఝాన్సీ, హరికుమార్‌రెడ్డి, మాధవ్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## కరుణాకర్‌రెడ్డికి..పర్వతరెడ్డి శుభాకాంక్షలు

తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి ఛైర్మెన్‌గా నూత నంగా పదవీస్వీకారం చేసిన భూమన కరుణాకర్‌రెడ్డిని శాసనమండలి సభ్యులు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఇటీవల తిరుపతిలో కలిసి, ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## దేశానికి రాజీవ్ సేవలు చిరస్మరణీయం

### - డిసిసి నేత చేవూరు



దేశాభ్యున్నతికి దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ చేసిన సేవలు మరచిపోలేమని, ఆయన చిరస్మరణీయు లని జిల్లా కాంగ్రెస్ అధ్య క్షులు చేవూరు దేవ కుమార్‌రెడ్డి అన్నారు. రాజీవ్ జయంతి సంద ర్భంగా ఈనెల 20న నెల్లూరులోని ఏసీ సుబ్బా రెడ్డి స్టేడియం వద్దనున్న రాజీవ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. కేకును కట్‌చేసి కాంగ్రెస్ అభిమానులకు పంచారు. ఈ సందర్భంగా చేవూరు మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ దేశప్రధానిగా దూరదృష్టితో ఐటీ రంగానికి ఊపిరిపోసి ఐటీరంగ పితామహునిగా ఖ్యాతినార్జించారన్నారు. యువతను రాజకీయాల్లో ప్రోత్సహించేందుకు 18 సంవత్సరాలకు ఓటు హక్కును కల్పించింది రాజీవ్ గాంధీయేనని కొనియాడారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సీవీ శేషారెడ్డి, పిసిసి అధికార ప్రతినిధి లేళ్లపల్లి సురేష్‌బాబు, నగర ఇన్‌చార్జి షేక్ ఫయాజ్, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు కొండా అనిల్‌కుమార్, పీసీసీ కార్యదర్శి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## 'తంగిరాల మహాభారతం' 69వ భాగం




రాజసూయ యాగం విజయవంతంగా ముగియగానే, భీష్మాచార్యుడు ధర్మరాజుతో ఇక నీవు అగ్రపూజ జరిపించవలసి ఉందని ఆదేశిస్తూ, ఆ పూజకు అర్హులైనవాళ్లు ఎటువంటి వ్యక్తిత్వం కలిగివుండాలో వివరిస్తాడు. ధర్మరాజు లౌక్యంగా అటువంటి వారెవరో చెప్పమని భీష్ముణ్ణే అడుగుతాడు.

అప్పుడు భీష్ముడు... మహానుభావుడు, సకలలోక పూజ్యుడు, అందరి హృదయాలను రంజింపచేసే శ్రీకృష్ణపరమాత్ముడే దీనికి అర్హుడని చెప్పినప్పుడు ధర్మరాజు ఎంతో సంతోషించి సహదేవుని పిలిచి అర్ఘ్య పాద్యాదులు తెప్పించి, శ్రీకృష్ణ నికి ఎంతో గౌరవంగా, శాస్త్రోక్తంగా, ప్రథమ పూజలాచరించాడు. అదిచూసి సహించలేక శిశుపాలుడు సభ మధ్యలోంచి లేచి నిలబడి, ధర్మరాజుని పరిపరివిధాల నిందిస్తాడు. సభలో శ్రీకృష్ణునికన్నా మహనీయులు లేరా అని, నీమీద గౌర వంతో రాజసూయ యాగానికి వచ్చిన రాజులను, వృద్ధుడైన భీష్ముని మాటలు విని అవమానించావని, కోపంతో తన బంధుగణంతో సభలోంచి నిష్క్రమిస్తాడు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.
పూర్తి నిడివి కోసం
Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.






## యోగాలో డా.కిషోర్స్ రత్నం విద్యార్థిని ప్రతిభ



ఇటీవల బెంగుళూరులో జరిగిన జాతీయస్థాయి ఆన్‌లైన్ యోగా పోటీల్లో నెల్లూరు సరస్వతినగర్‌లోని డాక్టర్ కిషోర్స్ రత్నం ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థిని కె.తనుస్విత ప్రతిభతో తృతీయస్థానం సాధించింది. రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు ఆ విద్యార్థినిని అభినందిస్తూ, తమ పాఠశాల విద్యార్థిని యోగాలో జాతీయస్థాయిలో రాణించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

## రక్తదానమంటే ప్రాణదానమే



రక్తదానమంటే ప్రాణదానమేనని, అత్యవ సర సమయాల్లో రోగు లకు, బాధితులకు రక్తం ఇస్తే అది వారి ప్రాణా లను కాపాడుతుందని ప్రముఖ న్యాయవాది, రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్ చెప్పారు. ఇటీవల ఆయన రెడ్‌క్రాస్ రక్తనిధిలో 45వ సారి రక్తదానం చేశారు. ఒకరు చేసే రక్తదానంతో ముగ్గురిని కాపాడవచ్చని, సమాజసేవాభావంతో రెడ్‌క్రాస్‌లో రక్తదానం చేసేందుకు దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు యడవల్లి సురేష్, టి.భాస్కర్‌రెడ్డి, స్పాస్టిక్ సెంటర్ ప్రిన్సిపల్ గురునాధరావు, సాయిరాం తదితరులు పాల్గొని రాజేంద్రప్రసాద్ సేవలను కొనియాడారు.

### పెద్దాసుపత్రి రోగుల సహాయకులకు...

# 'హరే కృష్ణ సుభోజనం'

## ○ ఎంపీ ఆదాల చేతులమీదుగా ప్రారంభం



'హరే కృష్ణ' సంస్థ ఆధ్వర్యంలో పేదలకు అన్నం పెట్టే 'సుభోజనం' కార్యక్రమం అద్భుతమని, ఆ కార్యక్రమం నెల్లూరులో ఏర్పాటుకావడం సంతోషకరమని నెల్లూరు ఎంపీ, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. నగరంలోని పెద్దాసుపత్రిలో ఇటీవల ఆయన 'హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ట్రస్ట్' వారు ఏర్పాటుచేసిన 'సుభోజనం' కార్యక్రమాన్ని ప్రారంభించారు.

నెల్లూరు ఆస్పత్రికి వచ్చే రోగుల సహాయకులకు ఈ కార్యక్రమం ద్వారా అన్నం పెట్టడం అభినందనీయమన్నారు. 'హరే కృష్ణ' సంస్థ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 20 లక్షల మందికి, తెలంగాణలో కోటి మందికి పైగా అన్నార్తులకు ఈ కార్యక్రమం కింద అన్నం పెడుతోందని తెలిపారు. ప్రపంచంలోని ప్రతిష్టాత్మక ధార్మిక సంస్థలలో ఒకటైన ఈ సంస్థ మానవసేవలో భాగంగా చేపట్టిన ఈ మంచి కార్యక్రమం గర్వ కారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దాతలకు ఆయన అభినందనలు తెలిపారు. జిల్లా కలెక్టర్ హరినారాయణన్, 'హరే కృష్ణ' సంస్థ ప్రతినిధి వంశీధర దాసు, డీసిసిబి మాజీ ఛైర్మెన్ ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ నరేంద్ర, పలువురు కార్పొరేటర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

### వేదగిరీశుని ఆలయంలో..

# నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట



నెల్లూరు రూరల్ మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రం నరసింహకొండలో వెలసివున్న శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో ఈనెల 21న నూతన ధ్వజస్తంభాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్టించి పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు ఆధ్వ ర్యంలో, ఆలయ నిర్వాహకుల పర్యవేక్ష ణలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం గరుడపంచమి పర్వదినాన్ని పురస్కరించు కుని ఆలయంలో కొలువైవున్న గరుత్మంతు నికి విశేషపూజలు, అభిషేకాలు చేశారు.



# రాజకీయ, మీడియా దిగ్గజాలతో.. బీఎంఆర్ మార్నింగ్ వాక్

చెన్నై సముద్ర తీరంలో నిత్యం అనేకమంది ప్రముఖులు ప్రతిరోజూ మార్నింగ్ వాక్ చేస్తుంటారు. ఇటీవల మార్నింగ్ వాక్‌లో తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, 'ది హిందు' ఆంగ్ల దినపత్రిక సంస్థల డైరెక్టర్, సీనియర్ పాత్రికేయుడు ఎన్.రామ్‌లతో మన నెల్లూరీయుడు, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు కలసి నడిచారు. ముగ్గురూ కాసేపు అనేక రాజకీయ, సామాజిక అంశాలపై చర్చించుకున్నారు.

# రవాణా శాఖ ఉద్యోగుల క్రీడోత్సాహం

## ఉప రవాణా కమిషనర్ చందర్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు






***ఎప్పుడూ ఉద్యోగ పనివత్తిడితో ఉండే రవాణాశాఖ అధికారులు, ఉద్యోగులకు ఆటవిడుపుగా ఉండేందుకు నెల్లూరు ఉప రవాణా కమిషనర్ చందర్ క్రీడల పోటీలు పెట్టి వారిని ఉత్సాహపరిచారు. దీంతో, నెల్లూరులోని రవాణాశాఖ ఉద్యోగుల్లో క్రీడోత్సాహం వెల్లువెత్తింది. ఎంతో సంతోషంతో వారంతా క్రికెట్లో పాల్గొన్నారు.***

జిల్లాలోని రవాణ శాఖ ఉద్యోగులకు ఈనెల 20న క్రికెట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంధ్రా స్టేడియం – బుజబుజనెల్లూరులో క్రికెట్ పోటీలు జరిగాయి. నెల్లూరు ఉప రవాణా కమిషనర్ బి.చందర్ ఈ కార్యక్ర మానికి అధ్యక్షత వహించి ఉద్యోగుల్లో క్రీడాసక్తిని కలిగించారు. జిల్లాస్థాయిలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో కావలి ప్రాం తీయ రవాణా శాఖ అధికారి పరిధిలో 'కావలి కింగ్స్ టీమ్', నెల్లూరు రవాణా శాఖ కార్యాలయం ఉద్యోగులు 'నెల్లూరు రాయల్స్' అనే పేరుతో జట్లుగా ఏర్పడి పోటాపోటీగా క్రికెట్ ఆడారు. నెల్లూరు రాయల్స్ తరఫున కెప్టెన్‌గా ఉప రవాణా కమిషనర్ చందర్, 'కావలి కింగ్స్' కెప్టెన్‌గా సుధాకర్‌రెడ్డి నిలిచి, ఐసిఏ స్టేడియంలో క్రికెట్ ఆడారు. మొదటగా టాస్ ఎంచుకున్న నెల్లూరు రాయల్స్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుని మైదానంలోకి దిగింది. మొదటగా బ్యాటింగ్ చేసిన కావలి కింగ్స్ జట్టు 147 పరుగులు సాధించి, 8 వికెట్లు కోల్పోయింది. ఆ జట్టు పరుగులను ఛేజింగ్ చేస్తూ నెల్లూరు రాయల్స్ జట్టు కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి, మూడు ఓవర్లు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని సాధిం చింది. ఈ పోటీలో అత్యుత్తమ బ్యాటింగ్ ప్రదర్శించిన ఏఎంవిఐ స్వప్నిల్ కుమార్ రెడ్డి ఉత్తమ బ్యాట్స్‌మెన్‌గా, హోంగార్డు ఆదినారాయణ ఉత్తమ బౌలర్‌గా, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నెల్లూరు ఉప రవాణా కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్య మెమెంటోలు అందుకున్నారు. ఈ రెండు జట్లలో కార్యాలయంలోని అన్ని కేటగిరీల సిబ్బంది పాల్గొన్నారు. అందరిలో క్రీడా స్ఫూర్తి నిలిపి, మానసిక ఒత్తిడి అధిగమిం చేలా ఈ విధంగా క్రీడా కార్యక్రమంలో సిబ్బందిని పాల్గొనేలా చేయటం చాలా అభినందనీయమని ఉప కమిషనర్ చందర్‌ను అందరూ ప్రశంసించారు.

# రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి.. రూ. 5 లక్షల విరాళం



నెల్లూరులో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలోని క్యాన్సర్ ఆసుపత్రికి ఇటీవల స్వర్గీయ నాతా సీతయ్య –నాతా రోశమ్మల పేరు మీద వారి కుమారుడు నాతా సుధాకర్ రావు, కోడలు నాతా విజయకుమారి 5లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ చేతుల మీదుగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.నాగేశ్వరరావుకు ఆ చెక్‌ను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ నెల్లూరు జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ సభ్యులు యాలమూరి రంగారావు, సభ్యులు జలదంకి సుబ్బారావు, కనుమూరు సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన

నెల్లూరులోని వెంకటేశ్వరపురంలో నగరపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్యాన్సర్ వ్యాధి లక్షణాలు–నివారణపై స్థానిక క్యాన్సర్ ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మి అవగాహన కల్పించారు. క్యాన్సర్‌కు దారితీసే ధూమపానం, మద్యపానం, పొగాకు ఉత్పత్తుల వాడకం వంటివాటికి విద్యార్థులు దూరంగా ఉండాలని చెప్పారు.

# డిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్‌లో.. సర్టిఫికెట్ల పంపిణీ




అల్లూరు మండలం నార్త్‌మోపూరులో ఉన్న దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్‌లో ఇటీవల టైలరింగ్‌లో శిక్షణ పొందిన 32 మంది మహిళలకు ఈనెల 21న సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కెనరా బ్యాంకు వారి సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్ర మంలో ఆ బ్యాంక్ రీజనల్ మేనేజర్ అడారి నాగరాజు చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణ పొందిన వారికి కెనరా బ్యాంకు మరియు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుల ఆర్థిక సహా యంతో కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. డిఎస్ఆర్ గ్రూప్ ఛైర్మెన్ దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ, మహిళల ఉపాధి కోసం నిర్వహిస్తున్న ఈ శిక్షణలను వారు సద్వినియోగం చేసుకోవాలని, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని చెప్పారు. అనంతరం, దేవిరెడ్డి శారద స్కూల్‌కు బస్సును వితరణగా అంద చేసినందుకు శ్రీరాజరాజేశ్వరీ కన్‌స్ట్రక్షన్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ అధినేత రావూరి రాముకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్ ద్వారా అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నందుకు సంతోషంగా ఉందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాము పేర్కొ న్నారు. డిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ దేవిరెడ్డి దశరథరామి రెడ్డి, అడ్మిన్ మేనేజర్ అనిల్‌కుమార్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి రామచంద్రరావు, దేవిరెడ్డి శారద హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎం. శ్రీలత, అల్లూరు కెనరా బ్యాంకు మేనేజర్ సందీప్‌రెడ్డి, ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు మేనేజర్ కృష్ణకుమార్ పాల్గొన్నారు.






# విజయవంతంగా వంద రోబోటిక్ మోకాలి శస్త్ర చికిత్సలు

## ○ నెల్లూరు అపోలో హాస్పిటల్ వైద్యుల ప్రతిభ

వైద్య సేవల రంగంలో తన కంటూ ప్రత్యేక గుర్తింపును పొందిన నెల్లూరు అపోలో స్పెషాలిటి హాస్పిటల్ మరో కీర్తిని సొంతం చేసుకుంది. అతి తక్కువ కాలంలో 100 రోబోటిక్ మోకాలి శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేసి అరుదైన గుర్తింపును పొందింది. ఆర్థోపెడిక్ సీనియర్ కన్సల్టెంట్, రోబోటిక్ నీ-సర్జరీస్ స్పెషలిస్ట్ డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, డాక్టర్ వివేకానందరెడ్డి, డాక్టర్ శశిధర్‌రెడ్డి, డాక్టర్ పమ్మి కార్తీక్ రెడ్డి బృందం తదితరులు మోకాలి శస్త్ర చికిత్సల్లో ప్రతిభా పాటవాలు ప్రదర్శిస్తూ రోగులకు స్వస్తత చేకూరుస్తున్నారు. సాధారణంగా మోకాలి శస్త్ర చికిత్సల్లో వైద్యులు సంప్రదాయ సాధనాలపై ఆధారపడతారు. ఇందుకోసం ప్రత్యేక శస్త్ర చికిత్స పరికరాలను ఉపయోగించి, మోకాలి మార్పిడి అమరికను అంచనా వేసి శస్త్ర చికిత్స చేస్తుంటారు. ఇది పూర్తిగా వైద్యుని నైపుణ్యంపై ఆధారపడి ఉంటుంది. అయితే నెల్లూరు అపోలో హాస్పిటల్ ఇటీవల అందుబాటులోకి తీసుకొచ్చిన రోబోటిక్స్ సర్జరీ ద్వారా త్రీడి సీటి ఆధారిత వర్చువల్ ప్లాన్ సహాయంతో వైద్యులు ప్రణాళికాబద్ధంగా కచ్చితత్వంతో శస్త్ర చికిత్స చేసే అవకాశం ఉంటుంది. అతి తక్కువ కాలంలో 100 రోబోటిక్ మోకాలి శస్త్ర చికిత్సలు పూర్తి చేసిన సందర్భంగా నెల్లూరులోని అపోలో హాస్పిటల్‌లో ఈనెల 20న డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి ఆయన వైద్య బృందం, హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాం సతీష్, హాస్పిటల్ సి.ఈ.ఓ నవీన్ విలేకరుల సమావేశం నిర్వహించి ఆధునిక వైద్యంలో ఎప్పటికప్పుడు మారుతున్న వైద్య ప్రమాణాలకు అనుగుణంగా నెల్లూరు అపోలో హాస్పిటల్‌లో కూడా అత్యాధునిక వైద్య పరికరాలను అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. రోబోటిక్ సర్జరీ ప్రపంచ వ్యాప్తంగా వైద్య రంగంలో ఒక గొప్ప పరిణామమని తెలిపారు.

## 'ఆస్పత్రి కథలు'

# పుస్తకావిష్కరణ



పెరంబూరు తెలుగు సాహితీ సమితి దశమ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 20న ప్రముఖ కథా రచయిత, బహు గ్రంథకర్త డా. టిఆర్ఎస్ శర్మ రచించిన 'ఆస్పత్రి కథలు' పుస్తకావిష్కరణ చెన్నై పెరంబూరులో ఉన్న ముక్కాల నమ్మాళ్వార్ శ్రేష్టి కల్యాణమండపంలో ఘనంగా జరిగింది. నెల్లూరుకు చెందిన ప్రముఖ బాలసాహితీవేత్త డా.గంగిశెట్టి శివకుమార్, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ (నెల్లూరు) ముఖ్య అతిథులుగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. దాదాపు 92 ఏళ్ళ వృద్ధాప్యంలో కూడా ఎంతో ఉత్సాహంగా టిఆర్ఎస్ శర్మ రచనా రంగంలో ఉంటూ అద్భుతంగా కథలను రచించడం విశేషమని వక్తలు కొనియాడారు. ప్రముఖ సాహితీవేత్త పిఆర్ కేశవులు ఈ కథల పుస్తకాన్ని సమీక్షించారు.

ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ కాసల నాగభూషణం, పెరంబూరు తెలుగు సాహితీ సమితి అధ్యక్షులు తమ్మినేని బాబు, సాహితీవేత్త గుడిమెట్ల చెన్నయ్య, వ్యాఖ్యాత బిట్రా గజగౌరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రచయిత టిఆర్ఎస్ శర్మ దంపతులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.



## వింజమూరులో రూ. 5 లక్షలతో..

# ప్రయాణీకులకు వసతి గృహం

## • యల్లాల కుటుంబసభ్యుల దాతృత్వం

మండల కేంద్రమైన వింజమూరులోని నడిమూరులో యల్లాల కుటుంబసభ్యులు సొంత స్థలంలో ప్రయాణీకుల సౌకర్యార్థం వసతి గృహాన్ని ఏర్పాటుచేశారు. కీర్తిశేషులు యల్లాల చిన్న వెంకటరెడ్డి, యల్లాల పుల్లమ్మల జ్ఞాపకార్థం ఎనిమిది అంకణాల స్థలంలో దాదాపు 5 లక్షల రూపాయల ఖర్చుతో నిర్మించిన ఆ ప్రయాణికుల వసతి గృహాన్ని ఇటీవల యల్లాల కుటుంబ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, రఘురామిరెడ్డి, వైవి రామిరెడ్డి, పిసివి రాఘవరెడ్డి దంపతులు పూజలు చేసి అందుబాటులోకి తెచ్చారు. ఈ ప్రాంతంలో ఎంతోకాలం నుంచి ప్రయాణీకుల కోసం ఆర్టీసి బస్సులు నిలుపుతున్నారని, దీనిని రిక్వెస్ట్ స్టేజీగా ప్రకటించాలని ఆర్టీసి అధికారులను కోరనున్నామని కూడా వారు ఈ సందర్భంగా చెప్పారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వింజమూరు గ్రామ సర్పంచ్ నల్లగొండ సృజన, జడ్పీటీసీ సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు ఇనగలూరు మోహన్‌రెడ్డి, సొసైటీ నూతన అధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, గ్రామ పెద్దలు గురజాల వెంకటరమణయ్య, మద్దూరు రాజగోపాల్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మిడదాల రాజా, గుణ్ణం ప్రసాద్‌రెడ్డి, యల్లాల రాఘవరెడ్డి, గణపం మాలకొండారెడ్డి, బయ్యపురెడ్డి శివ, వనిపెంట సుబ్బారెడ్డి, పీరయ్య, జహీర్ తదితరులు పాల్గొన్నారు.



## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## మాతృమూర్తి జన్మదినాన

# ఆర్డీవో కిరణ్ సేవా కార్యక్రమాలు




గూడూరు రెవెన్యూ డివిజన్ అధికారి ఎం.కిరణ్ కుమార్ తన మాతృమూర్తి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 19వ తేదీ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా గూడూరు ఏరియా ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు, డయాలసిస్ పేషంట్లకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. వార్డులోనే వారి అమ్మ జన్మదిన కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంతమంది మాతృమూర్తుల మధ్య మా తల్లి జన్మదిన వేడుకలు జరుపుకోవడం, బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ వారు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు ఆత్మకూరు సురేష్, డాక్టర్ బ్రహ్మయ్య, రూరల్ ఎస్.ఐ బ్రహ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# 9న మెగా లోక్‌అదాలత్

సెప్టెంబర్ 9న జరుగనున్న మెగా లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలని గూడూరు ఏడో అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం తెలిపారు. గూడూరు కోర్టు సముదాయంలో ఈ నెల 21న డిఎస్పీ సూర్యనారాయణరెడ్డితో కలిసి న్యాయమూర్తులు, న్యాయవాదులతో ఆమేరకు ఆమె సమీక్ష నిర్వహించారు.

# నూతన పింఛన్ విధానం రద్దు చేయాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఐక్యంగా నూతన పింఛన్ విధానాన్ని రద్దు చేసి పాత విధానం తిరిగి పునరుద్దరించాలని ఎన్ఎఫ్‌పీఈ ఆధ్వర్యంలో గూడూరు తంతి తపాలా కేంద్రం వద్ద ధర్నాందోళన చేపట్టారు. ప్రధాన పోస్టాఫీసు కార్యాలయం ముందు ఉద్యోగ సంఘం నాయకులు వ్యక్తం చేశారు. నవంబర్ 21 నుంచి 23వరకు జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.సుధాకర్, వెంకటేశ్వర్లు, గోవింద్ నాయక్, సుధాకర్‌రాజు, ఫిరోజ్, రత్నకుమారి, నాగరాజు పాల్గొన్నారు.

# రాజీవ్ సేవలు మరువలేం



దేశాభివృద్ధి కోసం మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ చేసిన సేవలు మరువలేనివని వెంకటగిరి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌ఛార్జ్ పంటా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గూడూరు గడియారపు స్తంభం కూడలిలో ఈ నెల 20వ తేదీ మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందని కొనియాడారు. నాయకులు అరవ పార్వతయ్య, తాజుద్దీన్, వేమయ్య, నాగభూషణం, శంకరయ్య, మూర్తి, మురళీ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు జేవీవీ కూరగాయలు



గూడూరు జె.వి.వి వారి ఆధ్వర్యంలో ఆర్ఆర్ ప్రొవిజన్స్ అధినేత ప్రభాకర్‌రెడ్డి దాతృత్వంతో ఈ నెల 20వ తేదీ రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో దివ్యాంగులకు ముఖ్యఅతిథి సర్పంచ్ జగదీష్ చేతుల మీదుగా కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేయడం జరిగింది. జె.వి.వి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రతి 3వ ఆదివారం 20 మంది దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెంచు నారాయణ, రామమోహన్, గుర్రం విజయ్‌బాబు, కటకం శ్రీను, రాధయ్య, మురళీసింగ్, సుబ్రహ్మణ్యం, అశోక్, విష్ణు, శంకర్, చిన్నయ్య, రాజేష్, సుధీర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# సురేంద్రకు 'బెస్ట్ సప్లయర్ గోల్డ్' అవార్డ్

చిన్న వయసులోనే ప్రముఖ పారిశ్రామికవేత్తగా ఎదిగిన కడివేడులోని పినాకిని కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఎం.డి బసిరెడ్డి సురేంద్రరెడ్డి ఇటీవల ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం హిందూజా గ్రూప్ అశోక్ లైలాండ్, చెన్నై వారి నుండి 'బెస్ట్ సప్లయర్ గోల్డ్' అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా గూడూరు బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షులు, 'లాయర్' గూడూరు ప్రతినిధి ఆనిమెళ్ళ శివకుమార్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# టిసిఎల్ జర్సీ ఆవిష్కరణ



గూడూరు, ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగే టిసిఎల్ క్రీడా పోటీలకు సంబంధించి ఈ నెల 20వ తేదీ అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో జెర్సీలను ఆవిష్కరించారు. క్రీడాకారులందరికీ జర్సీలను అందజేశారు. ఆగస్టు 25, 26, 27 తేదీలలో ఈ పోటీలు నిర్వహించనున్నారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు పి.డి.కరిముల్లా, కోట వెంకటేశ్వర్లు, మల్లికార్జున, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


# 'జాతీయ ఫిల్మ్ అవార్డ్స్'లో.. తెలుగోళ్ళు 'తగ్గేదే లే'

***కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకమైన 69వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను ఈనెల 24వ తేది గురువారం ప్రకటించింది. అందులో మన తెలుగోళ్ళు ఏకంగా తొమ్మిది అవార్డులను సొంతం చేసుకున్నారు. అందులో 5 అవార్డులు 'ఆర్ఆర్ఆర్' చిత్రం సాధించింది. మొత్తమ్మీద జాతీయ అవార్డులు సాధించడంలో కూడా తెలుగోళ్ళు 'తగ్గేదే లే'దంటూ తమ సత్తా నిరూపించుకున్నారు. దేశవ్యాప్తంగానే కాదు, ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకలోకాన్ని ఉర్రూతలూగించిన 'ఆర్ఆర్ఆర్' సినిమాకు అందరూ ఊహించినట్లుగానే పలు విభాగాల్లో అవార్డులు లభించడం విశేషం. 'పుష్ప' సినిమాలో 'తగ్గేదే లే' అంటూ కోరమీసం తిప్పిన అల్లు అర్జున్‌కు కేంద్రం 'ఉత్తమ నటుని'గా అవార్డునిచ్చింది. వివరాలిలా ఉన్నాయి.***

2021వ సంవత్సరంలో విడుదలైన చిత్రాలకు కేంద్ర ప్రభుత్వం గురువారం సాయంత్రం న్యూఢిల్లీలో ప్రకటించిన జాతీయ చలనచిత్ర పురస్కారాలు తెలుగు సినిమారంగానికి కొత్త ఉత్సాహాన్నిచ్చాయి. ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా 'ఆర్ఆర్ఆర్' చిత్రానికి అవార్డు లభించింది. ఆర్ఆర్ఆర్ సినిమాకు ఉత్తమ నటనాదర్శకత్వం వహించిన కింగ్‌సాలమన్, అదే సినిమాలో ఉత్తమ కొరియోగ్రఫీ నిర్వహించిన ప్రేమ్‌రక్షిత్‌కు, ఉత్తమ సంగీతదర్శకునిగా ఏ.ఎం కీరవాణి (ఆర్ఆర్ఆర్)కి, ఉత్తమ నేపథ్యగాయకునిగా ఆర్ఆర్ఆర్‌లోని 'కొమురం భీముడో' పాట పాడిన కాలభైరవకు ఉత్తమ అవార్డుడలు వచ్చాయి.

'పుష్ప–ది రైజ్' సినిమాలో అల్లు అర్జున్ విలక్షణ నటనకు 'ఉత్తమ నటుడు' అవార్డు రాగా, ఉత్తమ తెలుగు ఫీచర్ ఫిల్మ్‌గా మెగాస్టార్ మేనల్లుడు 'పంజా వైష్ణవ్ తేజ్' తొలి చిత్రం 'ఉప్పెన' ఉత్తమ అవార్డు నందుకుంది. ఇక మిగిలిన అవార్డుల విషయాని కొస్తే.. ఉత్తమ చిత్రంగా 'రాకెట్రీ' ఎంపికైంది. ఉత్తమనటి అవార్డు ఇద్దరు నటీమణులకు లభించింది. 'గంగూబాయి కాఠియావాడి' చిత్రంలో నటించిన ఆలియాభట్, 'మీమీ' చిత్రంలో నటించిన కృతిసనన్‌లకు 'ఉత్తమ నటి' అవార్డులు వచ్చాయి. ఉత్తమ సంభాషణల అవార్డు కూడా 'గంగూబాయి కాఠియావాడి' సినిమాకు లభించింది. హిందీలో 'ది కశ్మీర్ ఫైల్స్' చిత్రంలో నటించిన పల్లవి జోషికి ఉత్తమ సహాయనటిగా, 'మీమీ' హిందీ సినిమాలో నటించిన పంకజ్ త్రిపాఠికి ఉత్తమ సహాయ నటునిగా అవార్డులు లభించగా, 'ది నంబీ ఎఫెక్ట్' హిందీ చిత్రం 'ఉత్తమ చిత్రం' అవార్డును సాధించింది. 'గోదావరి' సినిమాకు దర్శకత్వం వహించిన నిఖిల్ మహాజన్‌కు 'ఉత్తమ దర్శకుడు' అవార్డు, మలయాళం సినిమా 'నాయట్టు'కు ఉత్తమ స్క్రీన్‌ప్లే అవార్డు లభించాయి. 'సర్దార్ ఉద్దమ్' సినిమాకు ఉత్తమ సినిమాటోగ్రఫీకి గాను అవిక్ ముఖోపాధ్యాయకు, ఉత్తమ నేపథ్యగాయనిగా శ్రేయాఘోషల్‌కు జాతీయ చలనచిత్ర పురస్కారాలు లభించాయి.

## ○ 9 పురస్కారాలు మనోళ్ళకే
## ○ 'ఆర్ఆర్ఆర్' చిత్రానికి 5 అవార్డులు







| | | |
|---|---|---|
| ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రం | : | ఆర్ఆర్ఆర్ |
| ఉత్తమ సంగీత దర్శకునిగా కీరవాణి | : | ఆర్ఆర్ఆర్ |
| ఉత్తమ నేపథ్యగాయకునిగా కాలభైరవ | : | ఆర్ఆర్ఆర్ |
| ఉత్తమ యాక్షన్‌డైరెక్టర్‌గా కింగ్ సాలమన్ | : | ఆర్ఆర్ఆర్ |
| ఉత్తమ కొరియోగ్రాఫర్‌గా ప్రేమ్‌రక్షిత్ | : | ఆర్ఆర్ఆర్ |
| ఉత్తమ నటునిగా అల్లు అర్జున్ | : | 'పుష్ప' |
| ఉత్తమ సంగీత దర్శకునిగా | : | దేవిశ్రీ ప్రసాద్ |
| ఉత్తమ గీత రచయితగా చంద్రబోస్ | : | కొండపొలం |
| ఉత్తమ తెలుగు చిత్రంగా | : | ఉప్పెన |



## నేత్రపర్వంగా..
# వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు



ఆకలై కొంగు పట్టేవారికి అన్నం పెట్టాలయ్యా!.. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలయ్యా!.. అంటూ మానవీయ సూక్తులతో, తన అద్వితీయమైన మహిమలతో అశేష భక్తజనులను ప్రభావితం చేసిన అవధూత భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారి ఆరాధనోత్సవాలు వెంకటాచలం మండలంలోని గొలగమూడిలో వారం రోజుల పాటు అద్వితీయంగా జరిగాయి. ఆగస్టు 18వ తేది నుంచి 24వ తేది గురువారం వరకు స్వామివారి 41వ ఆరాధనోత్సవాలకు భక్తజనం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. జిల్లా నుంచే నలుమూలల నుంచే కాక రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వెంకయ్యస్వామి భక్తులు, తమిళనాడు, కర్నాటక తదితర దూరప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి, విశ్రాంత ఐఏఎస్ అధికారి పి.బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఈ ఉత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, మౌలిక సదుపాయాలకు లోటు లేకుండా ఆలయ అధికారులు, జిల్లా అధికారులు కలసి కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. స్వామివారికి ఈ ఆరాధనోత్సవాల్లో ప్రత్యేక పూజలు, అలంకారాలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగాయి. వెంకయ్యస్వామికి ఎంతో ప్రీతిపాత్రమైన 'ఓం నారాయణ–ఆదినారాయణ' నామోచ్ఛారణలతో గొలగమూడి మార్మోగిపోయింది. ప్రతిరోజూ కన్నులపండువగా జరిగే పూజలు, వాహనసేవలతో గొలగమూడి కళకళలాడింది. ఆరాధనోత్సవాలు ప్రారంభమైన 18వ తేదీన సర్వభూపాల, కల్పవృక్ష వాహనసేవలు, 19న సూర్యప్రభ–చంద్రప్రభ, 20న హనుమంత–హంస వాహనసేవలు, 21న చినశేషవాహనం–గజవాహనం, 22న అశ్వవాహనం–పెదశేషవాహన సేవలు, 23న సింహవాహనం–గరుడసేవ ఉత్సవాలు వైభవంగా జరిగాయి. 24న గురువారం రోజు ప్రధానమైన రథోత్సవానికి భక్తజనం మరింత పెద్దసంఖ్యలో వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. సాయంత్రానికల్లా గొలగమూడి భక్తజనులతో క్రిక్కిరిసిపోయింది. రాత్రికి తెప్పోత్సవం నేత్రపర్వంగా జరిగింది. పెద్దఎత్తున పోలీసు బందోబస్తును ఏర్పాటుచేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా స్వామివారి దర్శనం కలిగే ఏర్పాట్లు చేశారు. స్వామివారి ఆరాధనోత్సవాలకు వచ్చిన భక్తులందరికీ ఆశ్రమం వారు అన్నప్రసాద వితరణ గావించారు.

# చంద్రయాన్ విజయం..అద్భుతం!
## - రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



చంద్రయాన్ విజయం అద్భుతమని, శ్రీహరికోటలోని షార్ కేంద్రం నుంచి జరిపిన ఈ ప్రయోగం ఉమ్మడి నెల్లూరు జిల్లాకు కూడా గర్వకారణమని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు. ఎంతో క్లిష్టమైన సాఫ్ట్‌ల్యాండింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడం భావితరాలకు స్ఫూర్తిదాయకమని, అకుంఠిత దీక్షతో శాస్త్రవేత్తలు ఈ విజయం సాధించారని కొనియాడారు. అంతరిక్ష రంగంలో మనదేశం మరోసారి తన ప్రతిభను చాటుకుందని పేర్కొంటూ ఇస్రో శాస్త్రవేత్తల బృందానికి ఆయన తన అభినందనలు తెలియజేశారు.

# దేశానికే గర్వకారణం
## - శ్రీసిటీ ఎం.డీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి



చంద్రయాన్ ప్రయోగం ద్వారా ప్రపంచంలోనే తొలి సారిగా చందమామ దక్షిణ ధ్రువంపై మన విక్రమ్ ల్యాండర్ సురక్షితంగా అడుగిడడం, తద్వారా భారతదేశ ఖ్యాతి విశ్వవ్యాప్తి కావడం సంతోషకరమని, మన భారత అంతరిక్ష శాస్త్రవేత్తల అపార ప్రజ్ఞా పాటవాలకు ఇది నిదర్శనమని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఒక సందేశంలో పేర్కొన్నారు. చంద్రయాన్ విజయం.. మనదేశానికి గర్వకారణమైన విజయమని పేర్కొంటూ, ఆ ప్రయోగాన్ని దిగ్విజయంగా నిర్వహించినందుకు ఇస్రో ఛైర్మెన్ డా.సోమనాథ్‌ను, శాస్త్రవేత్తల బృందాన్ని ఆయన అభినందించారు.

## టూకీగా...



### మాలకొండ ఆలయానికి కోటికి పైగానే ఆదాయం

కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాళెం మాలకొండలోని శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి ప్రతి శనివారం వేలసంఖ్యలో భక్తులు రావడం, పెద్దఎత్తున కానుకలు సమర్పించడం తెలిసిందే. 11 శనివారాల్లో భక్తులు సమర్పించిన కానుకలను ఇటీవల ఆలయ అధికారులు లెక్కవేస్తే కోటీ 3 లక్షలా 2వేలా 637 రూపాయలు రావడం గొప్ప విశేషమే!

### పెంచలస్వామికి వైభవంగా చందనాభిషేకం

పెంచలకోన శ్రీ లక్ష్మీనృసింహస్వామికి ఈనెల 19న చందనాభిషేకం వైభవంగా నిర్వహించారు. అనంతరం తిరుచ్చి ఉత్సవం, ఊంజల్‌సేవలు కన్నులపండువగా చేశారు. ఆలయ ఛైర్మెన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి, ఇఓ కోవూరు జనార్ధన్‌రెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజలు, సేవల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### కావలి నివాసి రోడ్డుప్రమాదంలో కన్నుమూత

కావలి ట్రంకురోడ్డులో పుస్తకాల షాపు నిర్వహిస్తున్న కోటా శ్రీనివాసరావు(61) ఈనెల19న రోడ్డుప్రమాదానికి గురై మృతి చెందాడు. కొండబిట్రగుంటలో దైవదర్శనం చేసుకుని స్కూటీపై వస్తూ మార్గమధ్యంలో కావలి టోల్‌గేట్ సమీపంలో వెనుకనుంచి వేగంగా లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించాడు. కావలి రూరల్ ఎస్‌ఐ సుమన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### జొన్నవాడలో నిత్యాన్నదానానికి.. లక్షా నూటపదహార్లు విరాళం

జొన్నవాడ కామాక్షితాయి దేవాలయంలో నిత్యాన్నదానానికి నెల్లూరుకు చెందిన తెనగలూరు రామలింగయ్య కుటుంబ సభ్యులు లక్షా నూటపదహారు రూపాయలను విరాళం సమర్పించారు. ఆలయ ఇఓ డి.వెంకటేశ్వర్లుకు దాతలు ఆ మొత్తాన్ని ఈనెల 19న అందజేశారు.

### కలువాయిలో విద్యార్థులకు ఐరన్‌టాబ్లెట్లు

మండలకేంద్రమైన కలువాయిలో బివిఎన్‌ఆర్ జడ్పీ హైస్కూల్ విద్యార్థుల్లో ఐరన్ లోపం ఉన్నవారిని గుర్తించి, ఆ లోపాన్ని సరిదిద్దేందుకు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది, పాఠశాల ఇన్‌చార్జి హెడ్మాస్టర్ చల్లా మల్లికార్జునరెడ్డికి ఐరన్ టాబ్లెట్లను అందజేయగా, వాటిని ఈనెల 19న ఆయన విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### కొండాపురం పాఠశాలలో మొక్కల పెంపకం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రమైన కొండాపురంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల ప్రహరీవెంబడి మొక్కల పెంపకానికి ఈనెల 19న శ్రీకారం చుట్టారు. ఏపిఓ పెంచలయ్య ఆధ్వర్యంలో 150 మొక్కలను ప్రహరీ చుట్టూతా నాటి, మరో 100 మొక్కలను స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద కూడా నాటారు.

### వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద.. 8 కిలోల వెండి పట్టివేత

వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద ఇటీవల సెబ్ అధికారులు అధికారులు వాహనాలను తనిఖీ చేస్తూ, ఒక ఆర్టీసీ బస్సులో ఒక వ్యక్తి ఎలాంటి బిల్లులు లేకుండా 8కిలోల వెండిని తీసుకు వెళ్తుండడంతో ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. కోవూరు సెబ్ సీఐ నరహరి ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### తూర్పు రొంపిదొడ్లలో శ్రీమానసాదేవికి ప్రత్యేకపూజలు

వరికుంటపాడు మండలంలోని తూర్పు రొంపిదొడ్ల గ్రామంలో చల్లా వంశస్తుల ఆధ్వర్యంలో ఇటీవల శ్రీ మానసా దేవి అమ్మవారికి శ్రావణమాసం పూజలు చేశారు. అమ్మవారికి భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన, సహస్రదీపాలంకారసేవ, అభిషేకాలు నిర్వహించారు. వచ్చిన భక్తులను ఆలయ అర్చకులు గోత్రనామాలతో పూజలు నిర్వహించి ఆశీర్వదించారు.

## కల్యాణ వైభవం...!



నెల్లూరు వాస్తవ్యులు 'సరయు ఆటో' సారధి దిలీప్ చక్రవర్తి - కల్పనల కుమార్తె **ప్రియ సరయు - మేగదీప్** (శ్రీకాళహస్తి వాస్తవ్యులు జులుగంటి నరసింహులు - ఉషారాణిల కుమారుడు)ల పరిణయం ఆగస్టు 21వ తేదీ నెల్లూరులో కెజికె కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాశీస్సులు.



వింజమూరు వాస్తవ్యులు గణపం శ్రీనివాసులురెడ్డి - అరుణల కుమారుడు **రాజగోపాల్‌రెడ్డి - సౌమ్య** (అనంతసాగరం మండలం, బి.అగ్రహారం గ్రామ వాస్తవ్యులు కాసా వెంకటసుబ్బారెడ్డి - పద్మావతిల కుమార్తె)ల కల్యాణం ఆగస్టు 18వ తేదీ వింజమూరులోని శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

## ఎన్‌బికెఆర్‌లో ఎన్‌సిసి కేడెట్లకు శిక్షణ



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆగస్టు 12 నుంచి 21వ తేది వరకు 10-ఆంధ్ర నావెల్ యూనిట్ ఎన్‌సిసి నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్ వినయ్ రామచంద్రన్ ఆధ్వర్యంలో నేవీ, ఆర్మీ సీనియర్ -జూనియర్ డివిజన్ కేడెట్ల సంయుక్త వార్షిక శిక్షణా శిబిరం జరిగింది. వివిధ కళాశాలలు, ఉన్నత పాఠశాలల కేడెట్లకు పలు పోటీలు నిర్వహించగా, గన్‌ఫైరింగ్‌లో నెల్లూరు బి.వి. నగర్‌లోని కెఎన్‌ఆర్ నగర పాలక ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న నేవీ కేడెట్ సాయ చరణి ప్రథమ స్థానంలో నిలిచింది. కమాండర్ వినయ్, సాయ చరిణిని సర్టిఫికెట్, మెడల్‌తో సత్కరించారు.



## అభినందనలు

తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి చైర్మెన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన కరుణాకరరెడ్డికి అభినందన శుభాకాంక్షలు తెలియజేస్తున్న పెన్నా సిమెంట్స్ పౌరసంబంధాల అధికారి (పిఆర్‌ఓ) వై.ఎల్.దీపక్‌రెడ్డి

## రత్నం మాస్టారుకు మాదాసు పరామర్శ

అనారోగ్యానికి గురై కోలుకుంటున్న రత్నం విద్యా సంస్థల వ్యవస్థాపకులు రత్నం మాస్టారును ఆయన చిరకాల మిత్రుడు, మాజీ శాసనమండలి సభ్యుడు మాదాసు గంగాధరం ఇటీవల కలిసి పరామర్శించారు.



## వైసిపికి మేలుకొలుపు

(మొదటి పేజీ తరువాయి)

కానీ, ఇప్పుడు ఆ పల్లెల్లోనూ మార్పు కనిపిస్తోంది. వైసీపీ సంక్షేమ పథకాలు అందుకుంటున్న వారిలో అత్యధిక శాతం పల్లె ఓటర్లే. వాళ్ళు తప్పకుండా తమకే ఓటేస్తారన్న వైసీపీ నమ్మకం మొన్న జరిగిన సర్పంచులు, గ్రామ వార్డు ఉపఎన్నికల ఫలితాలతో పటాపంచలైపోయింది. 34 సర్పంచి స్థానాలకు పోలింగ్ జరిగితే వైసీపీకి 22, టీడీపీకి 9, వైసీపీ రెబల్‌కి 1, టీడీపీ, జనసేన కలిపి 2 సర్పంచి స్థానాలు దక్కించుకున్నాయి. టీడీపీ గెలిచిన 9 స్థానాల్లో 7 గతంలో వైసీపీ గెలిచినవే. ఊహించని తరహాలో వచ్చిన ఈ ఫలితాలు వైకాపా శ్రేణులతో పాటు రాజకీయ వర్గాలను కూడా ఆశ్చర్యపరచాయి.

### మారుతున్న పల్లె ఓటరు...!

పంచాయతీ ఎన్నికల్లో అధికార బలాన్నంతా ఉపయోగించినా వైసీపీకి సంతృప్తికరమైన ఫలితాలు రాలేదు. వైసీపీ తమకే అత్యధిక స్థానాలొచ్చాయని పైకి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించినా, చాప కిందకు నీరొచ్చేసిందని మాత్రం గమనించుకోవాలి. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన స్థానిక ఎన్నికల్లో 95 శాతంపైగా స్థానాలు ఆ పార్టీయే కైవసం చేసుకుంది. ఇప్పుడు కథ మారింది. వైసీపీ ఖాతాలో నుంచి పల్లెలు కూడా ఒక్కొక్కటిగా చేజారిపోతున్నాయి. పంచాయతీ ఉపఎన్నికలు తప్పనిసరి పరిస్థితుల్లో జరిపింది ప్రభుత్వం. పెట్టదల్చుకుంటే దాదాపు 10 మున్సిపాలిటీలు, రాజమండ్రి కార్పొరేషన్‌కు ఎన్నికలు పెండింగులో ఉన్నాయి. కానీ, అవి అర్బన్‌లో ఉన్నాయి కాబట్టి వాటిని జరిపించేందుకు వెనుకడుగు వేస్తోంది. ప్రస్తుతం ఆయా మున్సిపాలిటీల్లో ప్రత్యేకాధికారుల పాలన నడుస్తోంది. ఇప్పటికిప్పుడు ఎక్కడైనా ఎన్నికలు జరిగితే వచ్చే తీర్పే రేపటి ప్రజాభిప్రాయం అన్న అనుమానంతో అర్బన్‌లో ఎన్నికలు జరపడానికి ప్రభుత్వం జంకుతోందన్నది విశ్లేషకుల అభిప్రాయం. ఒకవేళా అక్కడా మిశ్రమ ఫలితాలు వస్తే సార్వత్రిక ఎన్నికలపైన వాటి ఫలితాల ప్రభావం చూపుతుందన్న ఉద్దేశంతో వైసీపీ వాటిని నిర్వహించడం లేదని విశ్లేషకులు అంటున్నారు. అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ జయకేతనం ఎగరేసిన తర్వాత జరిగిన ఉప ఎన్నికలు ఇవి. అన్నీ వైసీపీ సిట్టింగ్ స్థానాలే. అన్నీ మనవే అన్న ధీమాతో అక్కడ ఎన్నికలు జరిపారు. ఇప్పుడు సగానికిపైగా వాటిని వైసీపీ పోగొట్టుకుంది. సొంత పార్టీలోని అంతర్గత కలహాలే చాలాచోట్ల టీడీపీకి విజయాన్ని కట్టబెట్టాయి. వైసీపీ అగ్ర నాయకత్వం ఖంగుతినే ఫలితాలు వచ్చాయి.

### బాబు చేసిన తప్పే జగన్ చేస్తున్నారా?

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిత్యం ప్రజాక్షేత్రంలో తిరిగిన జన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి. అధికారంలోకి వచ్చాక బటన్ నొక్కడానికి తప్ప బయటకు రావడం లేదు. అది కూడా పేరుకి జనం మధ్య జరిగినా జగన్‌కి జనంకి మధ్య అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. ఈ విషయంలో సొంత పార్టీ నేతలు, కార్యకర్తల్లో కూడా జగన్‌పై అసంతృప్తి వ్యక్తమవుతోందంటున్నారు విశ్లేషకులు. సర్వే సంస్థలు తప్ప, నిత్యం ప్రజల్లో తిరిగే తమలాంటి వారి అభిప్రాయం సీఎం జగన్ వరకూ చేరడం లేదన్న ఆవేదన వారిలో కనిపిస్తోందంటున్నారు. ఇలాంటి పరిస్థితులలో వైనాట్ 175 అంటూ సీఎం జగన్ అనడాన్ని వాళ్ళు తప్పు పడుతున్నారు. అధికార యంత్రాంగం చేతిలో ఉన్నప్పుడు క్షేత్రస్థాయిలో రాజకీయ గాలి ఎటు వీస్తోందో తెలుసుకోవడం క్షణాల్లో పని. ఇప్పటికే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వైసీపీకి వివేకవంతుల్లో ఎలాంటి ఆదరణ ఉందన్న విషయాన్ని స్పష్టం చేశాయి. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా వైసీపీ నుంచి క్రాస్ ఓటింగ్ జరిగింది. దీంతో టీడీపీ అభ్యర్థి పంచుమర్తి అనూరాధ విజయం సాధించారు. అయితే, ఆ ఎన్నికలు ముగిసిన నాలుగు రోజులకే జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనపై ప్రజలు 96శాతం సంతృప్తి వ్యక్తం చేశారంటూ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇవన్నీ కంటి తుడుపు ప్రకటనలే. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఏపీలో 24 నుండి 25 ఎంపీ సీట్లు వైసీపీకే వస్తాయని ఇటీవల మరో సర్వే రిపోర్టు బయటపెట్టారు. గతంలో ఇలాంటివన్నీ నమ్మి క్షేత్రస్థాయిలో వాస్తవాలను, కార్యకర్తలను విస్మరించారు కాబట్టే చంద్రబాబు ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నారు.

ఇప్పుడు వైసీపీ అదే దోవలో నడుస్తోంది. ఈ నిబద్ధత లేని సర్వేలు, మితిమీరిన ఆత్మవిశ్వాసం మంచిది కాదు. ఇప్పటికైనా మేల్కొని, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులకు తగినట్లుగా నిర్ణయాలు తీసుకుంటూ జగన్ మళ్ళీ జనంలోకి వచ్చి పార్టీని నడిపిస్తేనే మునుపటి వైభవం సాధ్యమవుతుందన్నది జనాభిప్రాయం..!

## టీడీపీ పరిశోధన కమిటీ సమావేశం



మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈనెల 22వ తేదీన టీడీపీ పరిశోధన మరియు సమాచార కమిటీ ఆధ్వర్యంలో రెండవ సమావేశం జరిగిందని ఆ కమిటీ సభ్యులు, ప్రముఖ న్యాయవాది మక్కెన అంకయ్యచౌదరి తెలిపారు. వైకాపా ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలను వివరిస్తూ, ప్రజలకు వాస్తవాలు తెలియజెప్పాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

## ప్రజలను చైతన్యవంతం చేసిన.. అన్నమయ్య సంకీర్తనలు

### గూడూరులో టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డా. ఆకెళ్ళ విభీషణశర్మ







తొలి తెలుగు వాగ్గేయకారుడు శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల వారు తిరుమలేశుని పాదాంకితంగా వేలాది సంకీర్తనలు రచించారని, నాటి సమాజాన్ని తన సంకీర్తనాగానాలతో చైతన్యవంతం చేశారని టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు డా.ఆకెళ్ళ విభీషణశర్మ అన్నారు. ఈనెల 22న గూడూరులోని డిఆర్‌డబ్ల్యు కళాశాలలో 'శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్య జాతీయ సాహితీ సదస్సు' జరిగింది. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు, దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు (బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం-వారణాసి) అన్నమయ్య సంకీర్తనల విశేషాలపై కీలకోపన్యాసం చేశారు. ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ అధ్యక్షత వహించిన ఈ సభలో డా. తుమ్మల శ్రీనివాసులు సంకీర్తనల్లోని సంగీతాంశాలను వివరించారు. మలిసభకు టీటీడీ పూర్వ సంచాలకులు భూమన్ అధ్యక్షత వహించి, అన్నమయ్య తేటతెలుగు పదాల గురించి అద్భుతంగా ప్రసంగించారు. టీటీడీ సంయుక్త కార్యనిర్వహణాధికారి సదాభార్గవి ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. అన్నమయ్య సాహిత్యంలో స్త్రీకి కల్పించిన ప్రాధాన్యతను యువతకు తెలియపరచాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం ఏర్పాటుచేశామని ఈ సదస్సుకు సారధ్యం వహించిన డిఆర్‌డబ్ల్యు మహిళా కళాశాల కార్యదర్శి డా. కె.మెహర్మణి అన్నారు.

# కార్పొరేట్‌కు ధీటుగా.. ప్రభుత్వ బడులు

## - కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల అభ్యున్నతి కోసం అనేకపథకాలను అమలుచేస్తోందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్కూళ్ల కంటే మెరుగ్గా అభివృద్ధి చేస్తోందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి చెప్పారు ఈనెల 22న ఆయన బుచ్చిరెడ్డి పాళెంలోని 16వ వార్డులో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడారు.

తాను ఇప్పటికి కోవూరు నియోజకవర్గంలోని 80 సచివాలయాల పరిధిలో 95,896 ఇళ్ళను సందర్శించానని, ఎక్కడికి వెళ్ళినా వైకాపా పట్ల, ముఖ్యమంత్రి జగన్ పాలన పట్ల ప్రజల్లో మంచి



ఆదరణ కనిపిస్తోందని ఆయన తెలిపారు. వైకాపా ప్రభుత్వం వచ్చిన ఈ నాలుగేళ్ళలో 'నాడు-నేడు' పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను అందంగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక మహిళలకు ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల సమాచారం ఉన్న బుక్‌లెట్లను అందజేశారు.

# సర్వే జనా సుఖినోభవంతు...!




'సర్వే' జనా సుఖినోభవంతు...' అంటే... 'ఓ సర్వే చేసే జనులరా.... ఏదో ఓ బొంకు బొంకయినా నాలుగు భవనాలు సంపాదించుకుని సుఖంగా ఉండడానికి ఇదే సమయం...' అని అర్థం.

ఎన్నికల సీజన్ తరుముకు వస్తోంది. ఇది మిస్ అయితే, మళ్లీ అయిదేళ్ల వరకు పలికే నాధుడు ఉండరు.

ఈ 'సర్వే' జనం అధికార పక్షాలకూ కావాలి, ప్రతిపక్షాలకూ కావాలి. పోటీ చేయడానికి పార్టీ టికెట్ వచ్చిన వాళ్ళకూ కావాలి, టికెట్ రాని వాళ్ళకూ(రెబెల్ అభ్యర్థిగా పోటీ చెయ్యడానికి) కావాలి. ఈ 'సర్వే'తో ఇదివరకు 'పీకే'సినవాళ్ళు, వరుస కుదిరితే, మళ్లీ 'పీకే'ద్దాం అనుకునేవారికి ఇదో సువర్ణావకాశం.

'సర్వే'శ్వరరావులకు సర్వేల్లో స్పెషలైజేషన్ ఏమీ అవసరం లేదు. కొంచెం రాజకీయ కనెక్షన్‌లు, కొంచెం స్మార్ట్‌నెస్.. కొంచెం మాటకారితనం ఉంటే చాలు. పొలిటికల్ బిజినెస్‌మెన్(అంటే... నేతలు) ఎగబడతారు.

ఎందుకంటే, వీరికి తమపైన తమకు నమ్మకం ఉండదు. ఓటర్లు తమ గురించి ఏమనుకుంటున్నారో తెలియదు. టికెట్ తమకు ఇస్తే, తమ నియోజకవర్గం వాళ్ళు ఎలా రియాక్ట్ అవుతారో తెలియదు. కిందటిసారి ఏవేవో వాగ్దానాలు చేశారు... గట్టెక్కేశారు.. మళ్లీ ఇప్పుడు ఏంటి పరిస్థితి? "మన కులపోళ్ళ మూడ్ ఎలా ఉంది? ఎగస్పార్టీ వాడు కూడా సేమ్ క్యాస్ట్ కదా.... అదీ ప్రాబ్లెమ్" వంటి ఆలోచనల్తో సతమతమవుతూ ఉంటారు.

'సర్వే' అనగానే.... జనం మైండ్ మీద ఎంతో కొంత ఇంపాక్ట్ పడుతుంది. 'సర్వే చేయించా... మనకే పరిస్థితి అనుకూలంగా ఉంది' అని చెప్పని నాయకుడు ఉండడు.

'టైమ్స్ నౌ' అనే ఒక ఇంగ్లీష్ న్యూస్ ఛానెల్ మొన్న ఒకే సర్వే అంటూ... జనాన్ని బాగా బెదరేసింది. ఏపీ నుంచి లోక్‌సభకు గల 25 స్థానాలలో 25కి 25, లేదా 24 స్థానాలు వైసీపీకి వస్తాయని చెప్పింది. దాంతో, వైసీపీ అనుకూల సాంఘికాసాంఘిక మీడియా రెచ్చిపోయింది. వైసీపీ అనుకూల విశ్లేషకులు విరుచుకుపడిపోయారు. తెలుగుదేశం కూటమికి ఒక్క సీటు కూడా రాదు పొమ్మన్నారు. రెండు రోజులపాటు ఊపేశారు.

అయితే, అది 'టైమ్స్ నౌ' సొంతంగా చేసిన సర్వే కాదంట.

'విదుర కన్సల్టింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్' అనే సంస్థకు చెందిన ఈటీజీ రీసెర్చ్ అనే ఏజెన్సీ తయారుచేసిన 'సర్వే'ను 'టైమ్స్ నౌ' తన సొంత సర్వే అన్నంత బిల్డ్‌అప్‌తో ప్రసారం చేసింది. ఈ 'విదుర కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్' అనే సంస్థ.. ఏపీ ముఖ్యమంత్రి కార్యాలయంలో పనిచేసే అవినాష్ అనే ఒక ముఖ్య ప్రముఖునికి చెందినదని 'గ్రేట్ ఆంధ్ర' అనే జగన్ వీరానుకూల వెబ్‌సైట్ పేర్కొంది. ఈ విషయం బాగా ప్రచారంలోకి రావడంతో, ఆ సర్వే విశ్వసనీయత ఒక్కసారిగా పేలిపోయింది.

అదే సమయంలో వైసీపీ ఎం.పి రఘురామకృష్ణ రాజు ఇంకో సర్వే బయటకు తీశారు. దాని ప్రకారం 25 లోక్‌సభ స్థానాలలో వైసీపీకి కడప, రాజంపేట,అరకు లోక్‌సభ స్థానాలలో మాత్రమే అనుకూలత ఉందని అంకెలు చెబుతున్నాయి. మరో మూడు, నాలుగు స్థానాల్లో... 'టైట్ ఫైట్' అని, మిగిలిన 18, 19 స్థానాల్లో టీడీపీ – జనసేన కూటమిదే ఆధిక్యత అని రఘురామరాజు తేల్చారు.

ఈ లెక్కన, వైసీపీకి పాతిక ఎంఎల్‌ఏ స్థానాలే అని ఆయన అంటున్నారు. ఈ అంకెలన్నీ.... 'సర్వే'ల పుణ్యమే.

వచ్చే ఎన్నికల్లో విజయానికి.... ఆధారపడుతున్న అనేక అంశాలలో ఈ 'సర్వే'లు కూడా ఒకటి అనడానికి ఈ 'టైమ్స్ నౌ' సర్వే ప్రచార తీరు ఒక ఉదాహరణ. ఈ సర్వే చిట్కాలు తేలిపోతున్నాయి.

వలంటీరు వ్యవస్థ తమను వచ్చే ఎన్నికల వైతరిణిని దాటిస్తుందని వైసీపీ నేతలు కొందరు గట్టి నమ్మకం పెట్టుకున్నట్టు కనబడుతోంది. కానీ, ఆ వ్యవస్థ బాగా అల్లరై పోతోంది. హత్యలు, మానభంగాలు, మోసాలు, వివాహిత మహిళలను లేపుకు పోవడాలవంటి ఘటనలు వలంటీర్ వ్యవస్థ పరువును బజారులో పడేశాయి. దీంతో, ఆ వ్యవస్థ పట్ల సమాజంలో బాగా చిన్నచూపు ఏర్పడింది. చివరకు, ఈ వ్యవస్థ... అధికార పక్షానికి ఏ మేరకు ఉపయోగపడుతుందో తెలియడం లేదు. వలంటీర్ వ్యవస్థపై ప్రజలలో ఏర్పడుతున్న వ్యతిరేకత, అసలుకే ఎసరు పెట్టవచ్చునని అంచనా వేసేవారు కూడా లేకపోలేదు.

చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ సభలకు అంతలేసి జనం రావడం అంటే... జనంపై వలంటీర్ ప్రభావం రోజు రోజుకూ పలుచనైపోతున్నట్టుగానే అంచనా వేయవచ్చునని ఒక విశ్లేషకుడు అభిప్రాయపడ్డారు.

రాష్ట్రంలోని ప్రతి 50 గృహాలకూ ఒక వలంటీర్ ఉంటే... వారు చిత్తశుద్ధితో 'పని' చేస్తూ ఉంటే.... ప్రతిపక్ష నేతల సభలకు వెళ్ళ వద్దని సహజంగానే చెబుతారు కదా! మరి, వారి సభలకు జనం పోటెత్తుతున్నారు అంటే... వలంటీర్లు పని చేయడం లేదా? అన్న సందేహం కలగక మానదు. లేకపోతే వెళ్ళవద్దని వారు చెప్పినా జనం ఖాతరు చేయడం లేదా? ఈ మీటింగ్‌లకే ఖాతరు చేయని జనం... పోలింగ్ రోజున ఏం ఖాతరు చేస్తారు? పోలింగ్ రోజున వలంటీర్ల మాట చెల్లకపోతే.... వాళ్ళను ఇంతకాలమూ ఎందుకు పోషించినట్టు? పైగా ఆ వలంటీర్ వ్యవస్థలో ఇంకో ట్విస్ట్ ఉంది.

'ధర్మజుడు తన్నోడి... నన్నోడెనా? నన్నోడి... తన్నోడెనా?' అని ద్రౌపతీదేవి దుశ్శాసునుడిని నిలదీసినట్టు, వలంటీర్లు ప్రైవేట్ వ్యక్తులా.... లేక ప్రభుత్వ ఉద్యోగులా అనేది తేలడం లేదు. ప్రభుత్వ ఉద్యోగులైతే, నియామకాలు ఏ ప్రాతిపదికన చేశారు? రిజర్వేషన్లు అమలు చేయలేదే? అయిదువేలు జీతం ఏమిటి? వారికి ఇంక్రిమెంట్లు, సెలవులు, ప్రమోషన్లు, ఇతర ప్రయోజనాలు ఎందుకు వర్తింపచేయడం లేదనే ప్రశ్నలు తల ఎత్తుతాయి. వారు స్వచ్ఛంద సేవకులే అయితే, వారికి ప్రభుత్వ ఖజానా నుంచి నెలకు రెండు వందల కోట్లకు పైబడి వేతనాల రూపంలో చెల్లించడం ఏమిటి అనే ప్రశ్న ఉండనే ఉంది. దీనిమీద వైసీపీ నుంచి స్పష్టత లేదు.






లక్షల సంఖ్యలో వలంటీర్లు ఉన్నప్పటికీ, ప్రతిపక్ష నేతల సభలకు జనం విరగబడడం... అధికార పక్షానికి మంచి శకునం కాదు.

మొన్న జరిగిన పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఉపఎన్నికల్లో టీడీపీకి సగానికి సగం రావడం... అధికార పక్షానికి మింగుడుపడేది కాదు.

ప్రభుత్వంపై చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ చేసే 'నిశిత' విమర్శలకు కౌంటర్‌లు ఇవ్వడానికి వైసీపీ పార్టీ పేర్ని నాని, కొడాలి నాని, అంబటి రాంబాబు, గుడివాడ అమరనాథ్, రోజా వంటి నేతలపైనే ఆధారపడడం పట్ల కూడా జనంలో అంత సానుకూలత వ్యక్తం కావడం లేదు. వారు జనంలోకి వెళ్లి మాట్లాడుతుంటే... వీరు మైక్రోఫోన్‌ల ముందు మాట్లాడుతున్నారు. ఒక జనసమూహంలోకి వెళ్లి మాట్లాడే పరిస్థితి వైసీపీలో కనపడడం లేదు. ముఖ్యమంత్రి పదవికి ఉండే సవాలక్ష భద్రతా పరిమితుల దృష్ట్యా... జగన్ జనంలోకి స్వేచ్ఛగా వెళ్ళలేరు. ఆ స్థాయి మరొక నాయకుడికి ఉన్నట్టు కనపడదు. ప్రతిపక్ష నేతలు రాష్ట్రవ్యాప్త పర్యటనలు చేస్తుంటే.. వైసీపీలో తమ తమ నియోజకవర్గాల్లో పాద యాత్రో... వాహన యాత్రో చేసేవారు కూడా కనపడడం లేదు.

వైసీపీకి ఇదో ప్రతిబంధకం.

ఇక, వైసీపీ మీద ప్రేమతోనో... స్వార్థంతోనో... అధికార యంత్రాంగం ఎక్కడికక్కడ దొంగోట్లు చేర్పించినట్లు సాక్ష్యాలు, రుజువులతో సహా బయటపడి పోతోంది. దాంతో, అధికారుల సస్పెన్షన్‌లు మొదలయ్యాయి. అనంతపురం జిల్లా పరిషత్ సీఈఓ భాస్కరరెడ్డిని, ఆయనకంటే ముందు ఆ ఉద్యోగంలో ఉన్న ఓ మహిళా అధికారిని జగన్ ప్రభుత్వమే సస్పెండ్ చేసింది. ఈ సస్పెన్షన్‌లు ముందు ముందు ఇంకా ఊపందుకుంటాయనే ప్రచారం జోరుగా సాగుతోంది.

ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు ఢిల్లీలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌ను ఈ పని మీదే కలవబోతున్నారు కూడా. ప్రభుత్వంలో ఉండే చంద్రబాబునాయుడు కంటే, ప్రతిపక్షంలో ఉండే చంద్రబాబునాయుడు చాలా దూకుడు మీద ఉంటారు. చురుకుగా ఉంటారు. ఆ విషయం వైసీపీ గమనించినట్టు లేదు.

ఈ దొంగ ఓట్ల తతంగం అనేది స్థానిక వైసీపీ నేతల ప్రోద్బలం మీద ఎక్కడికక్కడ స్థానిక అధికారులే నడుంబిగించారో లేక.. ఎవరైనా పెద్దల ఆదేశాల మేరకు చేపట్టారో తెలియదు గానీ... అపకీర్తి మాత్రం వైసీపీకి చుట్టుకుంది.

మామూలుగా గెలవలేక, దొంగోట్ల చేర్పుడు మీద వైసీపీ ఆధారపడిందనే ప్రచారం మాత్రం జనంలోకి వెళ్ళింది. ఈ ప్రచారాన్ని వైసీపీ నేతలు ఎవరూ ఖండించడం లేదు. దొంగోట్లు... వైసీపీ ప్రతిష్ఠకు ఇదో ఎదురు దెబ్బ అనుకుంటే, 'ఎదురు దెబ్బ'లకు కొరత ఏమీ కనపడడం లేదు.

అమరావతిలో నిముషాల మీద 'పేదల'కని ఓ యాభై వేల ఇళ్ళు కడదామని రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టింది. ముఖ్యమంత్రి శంకుస్థాపన కూడా చేశారు. ఈ నిర్మాణాల మీద హైకోర్టు స్టే ఇచ్చింది. ఈ స్టేని కూడా ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగకరంగా పలువురు పరిగణించారు.

వీటికితోడు, వై.ఎస్.జగన్ సోదరి షర్మిల ఎపిసోడ్ ఒకటి సిద్ధంగా ఉంది అంటున్నారు. ఆంధ్ర సంగతి చూడడానికి తన సోదరుడు ఉన్నందున, తెలంగాణ సంగతి చూద్దామని ఆమె అనుకున్నారు. తెలంగాణలో బాగానే శ్రమపడ్డారు. మాంచి విమర్శనాశక్తి కూడా ప్రదర్శించారు. అయితే, ఇప్పుడు ఆమె కాంగ్రెస్‌లో 'విలీనం' అయిపోయి ఆంధ్ర రాజకీయాలలో తన నడకను ప్రారంభిస్తారంటూ వార్తలు వెలువడుతున్నాయి.

అలా జరిగితే, వైసీపీ ప్రభుత్వానికి అదో అదనపు తలనొప్పి.

కాంగ్రెస్‌ను గాడిలో పెట్టడానికి... ఆంధ్రలో కూడా ఆమె ఓ మూడు వేల కిలోమీటర్లు రెండోసారి నడిచినా... సునాయాసంగా నడిచి పారేస్తారు.

చంద్రబాబు – పవన్ కళ్యాణ్ కూటమి జగన్ వ్యతిరేక ఓటే పట్టుకుపోతారని అనుకుందాం. షర్మిల అయితే మాత్రం... జగన్ అనుకూల ఓటును కూడా పట్టుకుపోతారు.

ఇలా జగన్ అనుకూల, వ్యతిరేక ఓట్లను వారంతా పట్టుకుపోవడం వైసీపీకి శుభ శకునం కాదు కదా!

ఎన్నికల షెడ్యూల్ ప్రకటితమైన మరుక్షణం... ప్రభుత్వ యంత్రాంగం కేంద్ర ఎన్నికల సంఘం నియంత్రణలోకి వెళ్ళిపోతుంది. అంటే, చీఫ్ సెక్రటరీ స్థాయి నుంచి... డీజీపీ స్థాయి నుంచి, గ్రామ వాలెంటీర్స్ వరకు... వారిపై ప్రభుత్వ నియంత్రణ జీరో అయిపోతుంది.

ఏయే పోలీసు, పోలీసేతర అధికారులను ఎన్నికల విధుల నుంచి తొలగించాలో, ఎందుకు తొలగించాలో... వారి ఈ నాలుగేళ్ల వ్యవహారశైలి ఏమిటో... మొదలైన వివరాలతో కూడిన జాబితాలను తయారుచేసుకుని తెలుగుదేశం నాయకులు కూర్చున్నారు... ఎన్నికల నగారా మోగగానే ఢిల్లీ విమానం ఎక్కడానికి.

ఇలా, ఒకదాని తరువాత ఒకటిగా ఎదురవుతున్న ప్రతికూల శకునాల మధ్య... ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయడానికి... అధికార పక్షం నేతలు... 'టైమ్స్ నౌ' తరహా సర్వేలపై ఎక్కువ ఆధారపడుతున్నారని విమర్శకులు అంటున్నారు.

అందుకే, 'సర్వే' జనా సుఖినో భవంతు... అనేది.

అయితే, ఇక్కడో గమ్మత్తు ఉంది. ఏదో 'పీకే'ద్దామనుకునే సర్వేశ్వర్రావులు పీకుదామనుకున్నది... చివరకు ఏమీ పీకలేకపోవచ్చు. జనం తెలివి మీరి పోయారు మరి!

- భోగాది వేంకట రాయుడు
medhomadhanam@gmail.com

# స్మృత్యంజలి



## జక్కా వెంకట్రామ్‌రెడ్డి (జె.వి.రెడ్డి) గారు

జననం : 07.01.1933

నిర్యాణం : 31.08.2020

### అయ్యా...

రోటరీ క్లబ్ వేదికగా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలకు
సారథిగా నిలిచారు...

దయార్ద్ర హృదయంతో మానసిక వికలాంగులకు అండగా నిలిచి
ప్రగతి చారిటీస్‌కి అభయహస్తమిచ్చారు...

నేనున్నానంటూ అనాథలను అక్కున చేర్చుకుని జనహిత వాత్సల్యపై
మీ వాత్సల్యాన్ని చూపించారు...

క్యాన్సర్ బాధితులకు భరోసా కల్పిస్తూ రెడ్ క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి
భూరి విరాళాన్ని అందించారు...

ఇస్కాన్ మందిరం వారి సేవాదృక్పథానికి మురిసిపోయి
సేవే పరమావధిగా వారి కార్యక్రమాలకి చేయూతనిచ్చారు...

కళ, సాహిత్య, సాంస్కృతిక రంగాల పట్ల మక్కువ చూపించి..
ఆయా రంగాలలో వారికి స్ఫూర్తిని కలిగించారు...

శ్రీ కస్తూరిదేవి విద్యాసంస్థల సెక్రటరీ & కరస్పాండెంట్‌గా
పేద విద్యార్థినుల జీవితాలలో విద్యాజ్యోతులు వెలిగించారు.

### అయ్యా...

మనసున్న మారాజుగా నా లాంటి వారికి ఎంతోమందికి
జీవనోపాధి కల్పించారు.

మా మనసుల్లో కనిపించే భగవంతుడిగా అవతరించారు.

మీరు లేరన్న నిజం నమ్మలేకున్నాం. మీరు మాకు దూరమై
మూడేళ్లు గడిచినా మీరు మా మధ్యలోనే ఉన్నట్లుగా భావిస్తున్నాం.

మేము తినే మెతుకులో, మేము పీల్చే గాలిలో, మేము తీసుకునే
శ్వాసలో మీరు శాశ్వతంగా సజీవమై ఉంటారని తెలుపుకుంటూ...

మీ 3వ వర్ధంతి సందర్భంగా స్మృత్యంజలి ఘటిస్తున్నాం.

**ప్రత్తి శ్రీనివాసులు**
(లేట్ ప్రత్తి సూరి కుమారుడు)
రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియం
శ్రీ కస్తూరిదేవి విద్యాలయ ప్రాంగణం
నెల్లూరు. సెల్ : 9347102503.



**జె.వి.రెడ్డి గారి మూడవ వర్ధంతి సందర్భంగా 31.08.2023న శ్రీ కస్తూరిదేవి విద్యాలయం విద్యార్థినులకు మరియు సిబ్బందికి ఉచిత అన్నప్రసాద వితరణ నిర్వహించబడును.**










Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com